## భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం




# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం, 29 జూలై-2026 balagamtv100@gmail.com పేజీలు-8


## సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం



## పరీక్షల సంస్కరణల బిల్లుకు
# మద్దతు ఇస్తాం



- గతంలో జరిగిన తప్పులపై వివరణ ఇవ్వాల్సిందే
- మహిళా బిల్లుతో డీలిమిటేషన్ చేర్చి గందరగోళం చేస్తున్నారు
- అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తాం
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

మిగతా 4లో..

# హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం..

- ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది
- కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం
- హైడ్రాపై కావాలనే తప్పడు ప్రచారాలు
- కావాలనే సోషల్ మీడియాతో దుష్ప్రచారాలు
- ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ,జూలై28 : హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట,బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు.హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు.ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశాడు. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించాడు. కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## విద్యార్థులపై దమనకాండకు సమాధానం ఇవ్వండి



- దాడి చేయమని ఎవరు ఆదేశించారో చెప్పండి
- యువత ఆలోచనలను పట్టించుకోని ప్రధాని మోడీ
- యాంటీ పేపర్ లీక్ బిల్లు చర్చలో ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రియాంక

మిగతా 3లో..

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్
- లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా
- గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు
- లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్



న్యూఢిల్లీ, జూలై 28 : భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఏ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర మిగతా 3లో..

# తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఢిల్లీలో మకాం

- రేవంత్, కెటిఆర్‌లపై నిజామాబాద్ ఎంపి అర్వింద్ సెటైర్లు



న్యూఢిల్లీ,జూలై28 : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనపై నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఈరోజు ఢిల్లీలో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడంలో విజయవంతమ య్యారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో విఫలమవడం వల్ల, తెలంగాణలో ప్రతి సంవత్సరం దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు తమ విద్యా భవిష్యత్తుపై అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. మిగతా 3లో..

## మోడీకి రీల్స్‌పై ఉన్న శ్రద్ధ.. విద్యార్థులపై లేదు



- కొత్త బిల్లులో కూడా చిత్తశుద్ధి కనిపించడం లేదు
- 2024లో చట్టం తెచ్చినప్పుడే ఈ ఆలోచన ఎందుకు లేదు
- మంత్రి ప్రధాన్‌ను తప్పించి..ప్రధాని మోడీని కాపాడారు
- లోక్‌సభలో చర్చ సందర్భంగా గొగో, అఖిలేశ్‌ల విమర్శలు

మిగతా 3లో..

# హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

- ప్రజలు స్వాగతిస్తుంటే.. వీరు విమర్శిస్తున్నారు
- నీట్‌పై కేంద్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించింది
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



మిగతా 3లో..

# హైదరాబాద్‌లో ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

- కోట్ల రూపాయాల సైబర్ మోసం
- కీలక నిందితుడిని అరెస్ట్ చేసిన ఇడి




హైదరాబాద్, జూలై 28 : హైదరాబాద్ కేంద్రంగా నడిచిన అంతర్జాతీయ ఫేక్ కాల్ సెంటర్ స్కామ్‌లో కీలక నిందితుడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారి వికాస్ కుమార్ నిమార్ అలియాస్ మిస్టీ.. అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో వికాస్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫేక్ కాల్ సెంటర్‌కు సంబంధించి మాదాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటర్‌పోల్ ద్వారా అమెరికా ఎంబసీ అందించిన సమాచారంతో సీబీఐ గతంలోనే కేసు నమోదు చేసింది. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్, విశాఖపట్నం, లఖ్‌నవూతో పాటు పలు నగరాల్లో నకిలీ

## నీట్ నిరసన ఉద్యమకారులకు ఊరట

### కేసులు ఎత్తేసిన బీహార్, అస్సాం ప్రభుత్వాలు

న్యూఢిల్లీ,జూలై28 : నీట్ యూజీ పరీక్షల వ్యవహారంలో ఆందోళనలు చేపట్టిన విద్యార్థులు, నిరసనకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీ ఊరట లభించింది. నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహ రించుకోవాలని అస్సాం, బిహార్ ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. రాజస్థాన్ ప్రభుత్వం కూడా త్వరలోనే ఇదే బాటలో నడవనుందని సమాచారం.ఈ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో చర్చించిన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు స్పష్టమైన హామీ ఇచ్చారు. అస్సాం, బిహార్ తరహాలోనే రాజస్థాన్‌లోనూ విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుం టామని తెలిపినట్లు సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ వెల్లడించారు. మరోవైపు విద్యార్థుల భవిష్యత్తు, విద్యా వ్యవస్థలో సంస్కరణలను మిగతా 3లో..

## నీట్ అరెస్ట్‌లపై సుప్రీం
# కీలక ఆదేశాలు

- మైనర్లు, నేరచరిత లేని వారిని వదిలేయండి
- విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశం



న్యూఢిల్లీ,జూలై28 : పరీక్ష పేపర్ లీకేజీలపై దేశ వ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. 18 ఏళ్లలోపు మైనర్లు, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా మిగతా 3లో..

# నగరంలో భారీ వర్షం



### లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం
### ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

హైదరాబాద్, జూలై 28: గ్రేటర్ హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైడ్రా, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ మాన్సూన్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కుండపోత మిగతా 3లో..

# మోడీకి రీల్స్‌పై ఉన్న శ్రద్ధ..విద్యార్థులపై లేదు

## మోడీకి రీల్స్‌పై ఉన్న శ్రద్ధ..విద్యార్థులపై లేదు

## కొత్త బిల్లులో కూడా చిత్తశుద్ధి కనిపించడం లేదు

## 2024లో చట్టం తెచ్చినప్పుడే ఈ ఆలోచన ఎందుకు లేదు

## మంత్రి ప్రధాన్‌ను తప్పించి..ప్రధాని మోడీని కాపాడారు

## లోక్‌సభలో చర్చ సందర్భంగా గొగో, అఖిలేశ్‌ల విమర్శలు

న్యూఢిల్లీ, జూలై 28 : పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటం చేస్తుంటే.. మోదీ మాత్రం రీల్స్ చేస్తూ కూర్చున్నారని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ విమర్శించారు. సమస్యపై కాకుండా ఇన్‌స్టాగ్రామ్‌పైనే ఆయన ఎక్కువ దృష్టి పెట్టారన్నారు. లోక్‌సభలో యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై చర్చలో గొగోయ్ మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు ప్రభుత్వం 2024లో ప్రవేశపెట్టిన చట్టం కఠినంగా ఉంటే.. పేపర్‌లీక్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. లీకేజీ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ బిల్లుకు ప్రతిపాదించిన సవరణలను పరిశీలిస్తే.. అర్థవంతమైన మార్పును తీసుకురావాలని ప్రభుత్వం అనుకోవట్లేదని తెలుస్తోంద న్నారు. ఈ పరీక్షా సంస్కరణలు కేవలం కంటితుడుపు చర్యలే అని.. గతంలో కూడా ప్రభుత్వం ఇలాంటి హామీలే ఇచ్చిందని పేర్కొన్నారు. 2024 నీట్ ప్రశ్నపత్రం లీకేజీని ప్రస్తావిస్తూ.. ఆ లీకేజీ జరిగినప్పుడు ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారని గొగోయ్ గుర్తు చేశారు. అప్పుడు కూడా ఎలాంటి లీకేజీ జరగలేదని కప్పిపుచ్చడానికి ఆయన ప్రయత్నించారని దుయ్యబట్టారు. సోమవారం భాజపా నేతలు ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టారు. తప్పును ఎదిరించి.. పోరాట స్ఫూర్తిని చాటిన విద్యార్థులకు గొగోయ్ ధన్యవాదాలు తెలిపారు.నిరసనకారులపైప్రభుత్వం అమానవీయంగా ప్రవర్తించిందని విమర్శించారు. నిరసనకారుల తలలపై పోలీసులు కొట్టారని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. అలా కొట్టాలని వారిని ఎవరు ఆదేశించారని ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి దించి.. ప్రధాని మోదీని భాజపా కాపాడిందని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఎంపీ అఖిలేశ్ యాదవ్ అన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించేలా ఒత్తిడి తెచ్చిన యువత నిరసనలను ప్రశంసించారు. దేవాలయాల విరాళాలను దొంగిలించిన వారు.. ప్రశ్నపత్రాల లీకేజీని ఆపలేరన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో ని వెనకబడిన వర్గాల విద్యా హక్కులను దోచుకుంటోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి వారు దేశంలోని లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని ఆరోపిం చారు. ప్రతిపక్ష నేతల ప్రశ్నలను భాజపా ఎంపీ బన్సూరీ స్వరాజ్ తిప్పికొట్టారు. యూపీఏ హయాం లో 2014కు ముందు ఏకంగా 22 సార్లు ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని అన్నారు. ఇప్పుడు ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలు.. అప్పుడు రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు.

# ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ అరెస్ట్

- అత్తాపూర్ స్టేషన్‌కు తరలింపు

హైదరాబాద్, జూలై 28 : సహచర ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదు నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తరలించారు. శంకరపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసు దర్యాప్తును ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ బదిలీ చేశారు. అకాడమీలో తనపై వేధింపులకు పాల్పడ్డాడని మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఈ నెల 18న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. లైంగికంగా వేధించడంతో పాటు.. వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి ఇబ్బందులకు గురి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా నిందితుడు పేర్కొన్న రెండు చిరునామాల్లోనూ నోటీసులు ఇచ్చేందుకు వెళ్లగా పోలీసులకు అతడి ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు తాజాగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసును పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

# హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

- ప్రజలు స్వాగతిస్తుంటే..వీరు విమర్శిస్తున్నారు
- నీట్‌పై కేంద్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించింది
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



హైదరాబాద్,జూలై28 : హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని, హైడ్రాపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేక ప్రచారం జరుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థ హైడ్రా అని, అందుకే సాధారణ ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి కొందరు రాజకీయ పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రాను అడ్డుకునేందుకు రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి హైడ్రాపై కుట్రలు చేస్తున్నాయన్నారు. కోర్టు వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైడ్రాకు సంబంధించిన పూర్తి తీర్పు ఇంకా వెలువడలేదని, తుది తీర్పు వచ్చిన తర్వాత ప్రభుత్వం చట్టపరంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రభుత్వం తరపున చెప్పాల్సిన అన్ని అంశాలనూ కోర్టు ముందే వివరిస్తామని, న్యాయ పక్రియను పూర్తిగా గౌరవిస్తామని చెప్పారు. అయితే కోర్టు తీర్పు పూర్తిగా రాకముందే కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాలు బయటకు వచ్చే వరకూ ప్రజలు పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. నీట్ పరీక్ష అనేది కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యార్థుల నిరసనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వారి ఆకాంక్షలకు చెంపపెట్టులాంటిదని విమర్శించారు. ప్రధాని నివాసం ముందు రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనతో ఈ ఉద్యమం మరింత ఉధృతమైందని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమాల వల్లే దేశవ్యాప్తంగా నిరసనలు విస్తరించాయని పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల్లో 90 శాతం మంది జెన్-జీ యువతేనని శ్రీధర్‌బాబు తెలిపారు. యువత ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డిదని కొనియాడారు. జెన్-జీతో పోటీ పడే ఆలోచనా విధానం ఆయనకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరు మంత్రులు కావాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

# భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో

# రీ-సర్వే కీలక ఘట్టం

- ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి
- రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- నిర్దేశించిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



హైదరాబాద్, జూలై 28 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మీక్షించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ-సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికత తో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చేందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రజావాణిని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్









హైదరాబాద్, జూలై 28 : ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ప్రజావాణికి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 2ఃఊఐ గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమం తదితర వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి ప్రతిరోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి వినతిని బాధ్యతా యుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తెలం గాణ రాష్ట్ర ఎలానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజా వాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి మాట్లాడి ప్రజా వాణి నిర్వహణ, సమస్యల పరిష్కార పక్రియపై వివరాలు తెలు సుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధా న్యంగా తీసుకుంటోందని, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ముడుమాల్ నిలువురాళ్ల పార్కు అభివృద్ధి

## శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి





నారాయణపేట,జూలై28 : చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని స్పష్టం చేశారు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని ముడుమాల్ గ్రామంలో ఉన్న చారిత్రక నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ... చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నిలువురాళ్ల పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ముడుమాల్ నిలువురాళ్ల పార్కుకు మరింత గుర్తింపు లభించడంతో పాటు పర్యాటకుల సంఖ్య పెరిగి స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు . ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ అకా డమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మాట్లాడుతూ... ముడుమల్ నిలువురాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వ కారణం అని,యూనెస్కో శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడు కోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది వరకు ఇక్కడ ఉన్న కలెక్టర్లు నిలువు రాళ్ళ పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. యునెస్కో శాశ్వత గుర్తింపు కొరకు కొన్ని సూచనలు ఇచ్చారని వాటిని పాటించి గుర్తింపు పొందేలా కృషి చేయాలన్నారు. ఇదివరకే మంత్రి వాకిటి శ్రీహరి గారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఇందుకు తగిన వసతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 400 పాఠశాలల హెడ్మాస్టర్లకు శిక్షణ ఇచ్చి దాదాపు 60 వేల మంది విద్యార్థులు మూడుమాల్ నిలువు రాళ్ళను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే 20 మంది టూరిస్ట్ గైడ్లను ఏర్పాటు చేసి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇందుకు తగిన మ్యాప్ తయారు చేయాలన్నారు. ప్రజలు భాగస్వాములై ఇక్కడి విశిష్టతను ప్రపంచానికి తెలియజేసేలా అవగాహన కల్పించుకోవాలన్నారు. శాస్త్ర విజ్ఞానం రాకముందే 3 వేల సంవత్సరాల క్రితం నిలువురాళ్ల రూపంలో నక్షత్ర మండలాన్ని ఆనాడే రూపొందించారని తెలిపారు. మనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో విశిష్టతను చాటేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై పొంగులేటి ఆరా



## కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మంత్రి

హైదరాబాద్,జూలై28 : మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరా తీసారు. సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దిని పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం వైద్యులతో మాట్లాడి అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని, ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# (మొదటిపేజీ తరువాయి)

## భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసు కున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

## తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఢిల్లీలో మకాం

పెరుగుతున్న ఆర్థిక భారం కారణంగా వందలాది కళాశాలలు కూడా మూసివేతకి సిద్ధంగా ఉన్నాయని ఎంపీ అన్నారు. కాంగ్రెస్‌కు ముందు, బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసిం దని మండిపడ్డారు. అవినీతిలో కూరుకుపోయిన కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి రుణభార ప్రాజెక్టులలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని కుమ్మరించిందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా కే-కుటుంబం అపారమైన సంపదను కూడబెట్టిందని ఆరోపించారు. ఇప్పుడు జెన్ జెడ్‌కు మద్దతుగా రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ మొసలి కన్నీళ్లు కార్చుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో అత్యధిక నిరుద్యోగ రేటు ఉన్న రెండు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ఎంపీ అన్నారు. దాదాపు 13 ఏళ్లుగా ఉద్యోగాల క్యాలెండర్‌ను నిలిపివేసినందుకు రేవంత్ రెడ్డి, కేటీఆర్‌కు అవార్డులు ఇవ్వాలంటూ సెటైర్ విసిరారు. తెలంగాణకు ఇప్పుడు ఆర్థిక క్రమశిక్షణ, స్వచ్ఛమైన పాలన ఉన్న ప్రభుత్వం కావాలన్నారు. అందుకే తెలంగాణ.. బీజేపీకి సిద్ధంగా ఉందని గట్టిగా నమ్ముతున్నట్లు ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

## నీట్ నిరసన ఉద్యమకారులకు ఊరట

దృష్టిలో ఉంచుకుని అస్సాం హోం శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 26 సాయంత్రం 6 గంటల వరకు నమోదైన 5 కేసుల్లో అరెస్టైన 13 మందిని త్వరితగతిన సమీక్షించి విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అంతేకాకుండా నిరసనల్లో పాల్గొన్న అభ్యర్థులు లేదా విద్యార్థులపై భవిష్యత్తులో ఎలాంటి చట్టపరమైన చర్యలు ఉండబోవని అస్సాం హోమ్ అండ్ పొలిటికల్ డిపార్ట్‌మెంట్ ప్రకటనలో స్పష్టం చేసింది. ప్రభుత్వాల ఈ నిర్ణయంతో వేలాది మంది విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నగరంలో భారీ వర్షం

వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, ఎల్‌బీ నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో బేగంపేట్, సికింద్రాబాద్, మణికొండ, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, కొంపల్లి, ఓల్డ్ సిటీ, అంబర్‌పేట్, కాచిగూడ ప్రాంతాల్లోనూ కుండపోత వర్షం పడటంతో రహదారులపై భారీగా నీరు నిలిచింది. పలుచోట్ల వాహనాలు ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించి, ఉద్యోగులు, ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడటంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హైడ్రా, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, జీహెచ్‌ఎంసీ మాన్సూన్ ఎమ్జన్÷న్సీ బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. నీరు నిలిచిన ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేస్తూ, ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించగా, వర్షం కొనసాగుతున్న నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

## హైదరాబాద్‌లో ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

కాల్ సెంటర్లను వికాస్ నిర్వహించాడు. ఈ ముఠా.. టెక్నికల్ సపోర్ట్ పేరుతో విదేశీయులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బు కాజేసింది. ప్రభుత్వ సంస్థలు, ప్రముఖ ప్రైవేట్ కంపెనీల అధికారులమంటూ బాధితులకు ఫోన్ కాల్స్ చేసి నిందితుడు బెదిరింపులకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. వికాస్.. కంప్యూటర్ వైరస్‌లు, బ్యాంక్ ఖాతా సమస్యలు, సెక్యూరిటీ అలర్ట్‌ల పేరుతో అమెరికన్లను భయపెట్టి డబ్బు వసూలు చేశాడని.. గిఫ్ట్ కార్డులు, డిజిటల్ పేమెంట్ల రూపంలోనూ బాధితుల నుంచి నగదు సేకరించినట్లు దర్యాప్తులో తేలింది. సేకరించిన డబ్బును క్రిప÷-టోకరెన్సీగా మార్చి ఆధారాలు లేకుండా ప్రయత్నించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. క్రిప÷-టో ఆస్తులను ఎక్స్ఛేంజ్‌లు, హవాలా తరహా నగదు సెటిల్‌మెంట్ నెట్‌వర్క్‌లు, బ్యాంకింగ్ మార్గాల ద్వారా భారత కరెన్సీగా మార్చినట్లు విచారణలో బయటపడింది. వీసీ సొల్యూషన్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి మోసపూరిత డబ్బును చట్టబద్ధ ఆదాయంగా చూపించే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. వీసీ సొల్యూషన్స్ బ్యాంక్ ఖాతాల్లో భారీ నగదు డిపాజిట్లు, అనుమానాస్పద క్రెడిట్ లావాదేవీలను గుర్తించారు. ÷ాల్ సెంటర్ ద్వారానే ఆదాయం వచ్చినట్లు విచారణలో నిమార్ అంగీకరించినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. అయితే ఈ డబ్బును ఆదాయపు పన్ను రిటర్న్‌లో కిరాణా వ్యాపారం, ఇతర వ్యాపారాల ఆదాయంగా వికాస్ చూపించాడని తెలిపారు. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర, నిధుల ప్రవాహం, క్రిప్టో లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## నీట్ అరెస్ట్‌లపై సుప్రీం కీలక ఆదేశాలు

సాగిన నిరసనల సమయంలో, విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనలకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా, అత్యున్నత న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిర్దోషులపై అతిక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు, తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ' జరగాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలుపడం పౌరుల ప్రాథమిక హక్కు అని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో, వారిపై బలాన్ని ప్రయోగించడం సరికాదని కోర్టు భావించింది. ఈ ఆందోళనల సమయంలో విద్యార్థులపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, గాయపడిన పోలీసుల రక్షణ, వారి భద్రతా పరికరాల గురించి కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కోర్టు పేర్కొంది. శాంతిభద్రతల నిర్వహణ అనేది ద్వితీయ ప్రాధాన్యం కాకూడదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో జరుగుతున్న నిరసనల సమయంలో శాంతిభద్రతల నిర్వహణకు, అల్లర్లను అదుపు చేయడానికి సంబంధించి ఒకే విధమైన ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వేర్వేరుగా ప్రవర్తించడం సరికాదని, నిర్దిష్ట నియమావళి ఉండాలని సూచించింది.

## రేపిస్ట్‌లను సమర్థించే వ్యక్తికి విద్యాశాఖ

### ప్రహ్లాద్ జోషిపై మండిపడ్డ రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ,జూలై28 : కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ప్రహ్లాద్ జోషి అత్యంత నీచమైన ప్రవర్తన కలిగిన వ్యక్తి అంటూ రాహుల్ మండిపడ్డారు. రేపిస్ట్‌లను ఆయన రక్షిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం పార్లమెంట్ బయట రాహుల్ గాంధీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ మాట్లాడుతూ.. 'యువత విద్యావ్యవస్థపై నిరసనలు తెలుపుతోంది. చాలా మంది అమ్మాయిలు ఆందోళనలు చేస్తున్నారు. పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేశారు. అంతటితో ఆగకుండా.. రేపిస్ట్‌లను సమర్థించే ఓ వ్యక్తిని బీజేపీ విద్యాశాఖ మంత్రిని చేసింది. ఆయన అత్యంత నీచమైన వ్యక్తి. రేపిస్ట్‌లకు రక్షణ కావాలని చెప్పే వ్యక్తి కంటే మించిన నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. అలాంటి వ్యక్తి భారతదేశ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు' అని వ్యాఖ్యానించారు. బిల్కిస్ బానో గ్యాంగ్‌రేప్ కేసులో దోషుల శిక్షా కాలాన్ని తగ్గించి, విడుదల చేయడాన్ని గతంలో ప్రహ్లాద్ జోషి సమర్థిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రాహుల్ ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# వెయిట్ లిఫ్టర్ అజయ్‌కు అభినందనల వెల్లువ

- సిఎం, డిప్యూటి సిఎం ప్రశంసలు



అమరావతి,జూలై28 : గ్లాస్గోలో జరుగుతోన్న కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించిన వెయిట్ లిఫ్టర్ అజయ్ బాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటి సిఎం పవన్, మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్‌లో చంద్రబాబు స్పందిస్తూ.. గ్లాస్గో 2026 కామన్వెల్త్ క్రీడల్లో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో వల్లూరి అజయ్ బాబు రజత పతకం సాధించారని, తన తండ్రి శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తూ క్రీడా వారసత్వాన్ని విజయవంతంగా కొనసాగించారని కొనియాడారు. అజయ్ సాధించిన ఈ విజయం ఏపీతో పాటు యావత్ భారతదేశానికే గర్వకారణమన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ క్రీడా కీర్తిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. మన్వెల్త్ గేమ్స్-2026లో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలియజేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. గ్లాస్గోలో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించి.. భారతదేశానికి మరో కీర్తిని తెచ్చిపెట్టిన అజయ్ బాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. స్వర్ణ పతకాన్ని అత్యంత స్వల్ప తేడాతో చేజార్చుకున్నా ఛాంపియన్‌గా నిలిచావని కొనియాడారు. అజయ్ బాబు ప్రదర్శన.. ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. అజయ్ బాబు.. విజయనగరం జిల్లా కీర్తిని ప్రపంచ వేదికపై చాటారని.. తండ్రి వల్లూరి శ్రీనివాసరావు క్రీడా వారసత్వాన్ని కొనసాగించారని పవన్ అన్నారు. భారతదేశానికి మరో గర్వకారణమైన విజయాన్ని అజయ్ అందించారన్నారు. తమ బిడ్డలలో ఒకరు భారత్‌కు కీర్తిని తెచ్చిపెట్టినందుకు ఆంధ్రప్రదేశ్ ఎంతో గర్వపడుతోందని అన్నారు. ప్రపంచ వేదికపై మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ.. అజయ్ బాబుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబును మంత్రి నారా లోకేశ్ అభినందిస్తూ.. తండ్రికి తగ్గ తనయుడు అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'గ్లాస్గో 2026లో పురుషుల 79 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబుకు హృదయపూర్వక అభినందనలు. తన తండ్రి వల్లూరి శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తూ, అజయ్ యావత్ దేశానికి గర్వకారణంగా నిలిచాడు. అతను మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశిస్తున్నాము' అంటూ ఎక్స్‌లో లోకేశ్ పోస్ట్ చేశారు.

# మోడీకి రీల్స్‌పై ఉన్న శ్రద్ధ..విద్యార్థులపై లేదు

- కొత్త బిల్లులో కూడా చిత్తశుద్ధి కనిపించడం లేదు
- 2024లో చట్టం తెచ్చినప్పుడే ఈ ఆలోచన ఎందుకు లేదు
- మంత్రి ప్రధాన్‌ను తప్పించి..ప్రధాని మోడీని కాపాడారు
- లోక్‌సభలో చర్చ సందర్భంగా గొగో, అఖిలేశ్‌ల విమర్శలు



న్యూఢిల్లీ, జూలై 28 : పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటం చేస్తుంటే.. మోదీ మాత్రం రీల్స్ చేస్తూ కూర్చున్నారని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ విమర్శించారు. సమస్యపై కాకుండా ఇన్ స్టాగ్రామ్‌పైనే ఆయన ఎక్కువ దృష్టి పెట్టారన్నారు. లోక్‌సభలో యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై చర్చలో గొగోయ్ మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు ప్రభుత్వం 2024లో ప్రవేశపెట్టిన చట్టం కఠినంగా ఉంటే.. పేపర్‌లీక్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. లీకేజీ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ బిల్లుకు ప్రతిపాదించిన సవరణలను పరిశీలిస్తే.. అర్థవంతమైన మార్పును తీసుకురావాలని ప్రభుత్వం అనుకోవట్లేదని తెలుస్తోందన్నారు. ఈ పరీక్షా సంస్కరణలు కేవలం కంటితుడుపు చర్యలే అని.. గతంలో కూడా ప్రభుత్వం ఇలాంటి హామీలే ఇచ్చి ందని పేర్కొన్నారు. 2024 నీట్ ప్రశ్నపత్రం లీకే జీని ప్రస్తావిస్తూ.. ఆ లీకేజీ జరిగినప్పుడు ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారని గొగోయ్ గుర్తు చేశారు. అప్పుడు కూడా ఎలాంటి లీకేజీ జరగలేదని కప్పిపుచ్చడానికి ఆయన ప్రయత్నించారని దుయ్యబట్టారు. సోమవారం భాజపా నేతలు ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టారు. తప్పును ఎదిరించి.. పోరాట స్ఫూర్తిని చాటిన విద్యార్థులకు గొగోయ్ ధన్యవాదాలు తెలిపారు. నిరసనకారులపై ప్రభుత్వం అమానవీయంగా ప్రవర్తించిందని విమర్శించారు. నిరసనకారుల తలలపై పోలీసులు కొట్టారని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. అలా కొట్టాలని వారిని ఎవరు ఆదేశించారని ప్రశ్నిం చారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి దించి.. ప్రధాని మోదీని భాజపా కాపాడిందని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఎంపీ అఖిలేశ్ యాదవ్ అన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించేలా ఒత్తిడి తెచ్చిన యువత నిరసనలను ప్రశంసించారు. దేవాలయాల విరాళాలను దొంగిలించిన వారు.. ప్రశ్నపత్రాల లీకేజీని ఆపలేరన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని వెనకబడిన వర్గాల విద్యా హక్కులను దోచుకుంటోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారు దేశంలోని లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని ఆరోపించారు. కాగా ప్రతిపక్ష నేతల ప్రశ్నలను భాజపా ఎంపీ బన్సూరీ స్వరాజ్ తిప్పికొట్టారు. యూపీఏ హయాంలో 2014కు ముందు ఏకంగా 22 సార్లు ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని అన్నారు. ఇప్పుడు ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలు.. అప్పుడు రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు.

# విద్యార్థులపై దమనకాండకు సమాధానం ఇవ్వండి



- దాడి చేయమని ఎవరు ఆదేశించారో చెప్పండి
- యువత ఆలోచనలను పట్టించుకోని ప్రధాని మోడీ
- యాంటీ పేపర్ లీక్ బిల్లు చర్చలో ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రియాంక

న్యూఢిల్లీ, జూలై 28 : నీట్ ప్రశ్నపత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన దమనకాండకు సమాధానం చెప్పాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై దాడి చేయాలని ఎవరు ఆదేశించారని ఆమె సూటిగా ప్రశ్నించారు. వారిపై టియర్ గ్యాస్ ఎందుకు ప్రయోగించారు.. అలాగే విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందంటూ కేంద్రానికి ప్రియాంక గాంధీ వరుసగా ప్రశ్నలు సంధించారు. అలాగే ప్రభుత్వ తీరును గట్టిగా తూర్పారా బట్టారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంగళవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై యువత ఆగ్రహంతో ఉందని అన్నారు. దేశ యువతను చూసి కేంద్రం భయపడుతోందని విమర్శించారు. విద్యావ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్ కబ్జా చేసిందని ఆరోపించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కారణంగా చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరగాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల బాధను ఎవరు తీరుస్తారని కేంద్రాన్ని ఆమె ప్రశ్నించారు. ఆ తల్లిదండ్రులు ఎంతో ఆవేదనతో ఉన్నారని పేర్కొన్నారు. ఆందోళన చేసిన విద్యార్థులు తీవ్రవాదులు కాదు కదా? అంటూ కేంద్రంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయాల్సిన అవసరం ఏమిటని కేంద్రాన్ని నిలదీశారు. ప్రశ్నపత్రాల లీక్‌తో పిల్లల జీవితాలతో ఆడుకుంటున్నారని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీక్ ఘటనలకు కారణమైన మాఫియాను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పేపర్ల లీక్‌ల వల్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ల లీక్‌లతో వేల మంది విద్యార్థుల ఆత్మస్థైర్యం దెబ్బతిందని ప్రియాంక గాంధీ ఆందోళన చెందారు. 152 సార్లు పేపర్ లీక్స్ జరిగాయని.. అయినా ఒక్కరిపైనా కూడా చర్యల్లేవని కాంగ్రెస్ ఎంపీ పెదవి విరిచారు. ప్రతి ఏటా బడ్జెట్‌లో విద్యాశాఖ కేటాయింపులను తగ్గిస్తున్నారని విమర్శించారు. పదవికి రాజీనామా చేసిన మంత్రికి ఘనస్వాగతం పలకడం.. సిగ్గుపడేలా ఉందని అన్నారు. దేశంలో యువత ఏం కోరుకుంటోందో అర్థం కావట్లేదని ప్రధాని మోదీకి ప్రియాంక గాంధీ చురకలంటిం చారు. మహిళలను అవమానించిన ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ కేటాయించారని ఆరోపించారు. దేశంలో పరీక్షా విధానం ఘోరంగా విఫలమైందని అన్నారు. మార్చుకో వాల్సింది కెమెరా యాంగిల్స్ కాదంటూ మోదీకి సూచించారు. తన మనసులోని యాంగిల్స్‌ను మార్చుకోవాలని మోదీకి స్పష్టం చేశారు. తన సలహాదారులను మార్చుకోవాలని ప్రధాని మోదీకి కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ హితవు పలికారు.

# పోచమ్మ ఆలయంలో దొంగల బీభత్సం

### బంగారు, వెండి ఆభరణాల చోరీ

రంగారెడ్డి,జూలై28 : జిల్లాలోని గండిపేట్ మండలం ఖానాపూర్ పోచమ్మ ఆలయంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ప్రసిద్ధ పోచమ్మ తల్లి దేవాలయంలో అర్ధరాత్రి చొరబడిన దుండగులు.. గుడిని గుల్ల చేశారు. అమ్మవారి ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు హుండీని దోచుకెళ్లారు. దోపిడీ విలువ సుమారు రూ.20 లక్షల పైనే ఉంటుందని అంచనా. ఆధారాలు దొరక్కుండా ఆలయంలోని సీసీ కెమెరాల డీవీఆర్ కూడా దుండగులు మాయం చేశారు. పక్కా పథకం ప్రకారం, ఆలయ రూట్ మ్యాప్‌పై అవగాహన ఉన్నవారే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలిసిన వ్యక్తులే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని ఆలయ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌తో దర్యాప్తు ప్రారంభించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. దొంగల కోసం గాలింపు చేపట్టారు. అమ్మవారి సొత్తును దోచుకెళ్లిన పాపాత్ములను వెంటనే పట్టుకోవాలని భక్తులు, గ్రామస్థుల డిమాండ్ చేస్తున్నారు.

# అంగన్వాడీల విషయంలో తప్పుడు ప్రచారం

### వైసీపీపై మంత్రి నారా లోకేశ్ విమర్శలు



అమరావతి,జూలై28 : అంగన్వాడీల విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే అంగన్వాడీలకు అమ్మఒడి పథకం అందలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం అమలు చేసిందని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో తనకు మద్దతుగా అంగన్వాడీలు నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీని వైసీపీ నేతలు కావాలనే నిరసన కార్యక్రమంగా చూపుతున్నారని మండిపడ్డారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 'ఫేక్ వర్సెస్ రియల్' పేరుతో వీడియోను విడుదల చేశారు. అంగన్వాడీల పేరుతో విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి తెలిపారు. వైసీపీ హయాంలో అంగన్వాడీ కార్యకర్తలకు అమ్మఒడి ఇవ్వకుండా గొడ్డలి పార్టీ అన్యాయం చేసిందని మంత్రి మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయడంతో సంతోషంతో వారు నా పెనమలూరు నియోజకవర్గ పర్యటనలో కృతజ్ఞతలు తెలిపారు. గొడ్డలిపోటును గుండెపోటుగా ప్రచారం చేసిన గొడ్డలి పార్టీ.. అంగన్వాడీల ఈ కృతజ్ఞత ర్యాలీని, నిరసన ర్యాలీ అంటూ విష ప్రచారం చేస్తోంది' అని ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు.

# రాజీనామాకు ముందు... ధర్మేంద్ర శాఖ మార్పు

### ఊహాగానాలు తోసిపుచ్చిన బిజెపి ప్రతినిధి

న్యూఢిల్లీ,జూలై28 : కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు శాఖను మారుస్తారని అనేక వార్తలు, ఊహాగానాలు వచ్చాయి. ముఖ్యంగా ఆయనను మరోశాఖకు మార్చాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని, దానిని కాక్రోచ్ జనతా పార్టీ తిరస్కరించడంతోనే ఆయన రాజీనామా చేయాల్సి వచ్చిందని ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను భాజపా ఖండించింది. అవి పూర్తిగా నిరాధారమైనవని, కల్పితమైనవని పేర్కొంది. ఈ అంశంపై భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమే ఇది అని అన్నారు. ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదని తెలిపారు. ఇవన్నీ నిరాధార కథనాలేనని కొట్టిపారేశారు. కేవలం సంచలనాల కోసం ఇలాంటి అసత్య వార్తలను వ్యాప్తి చేయవద్దని హితవు పలికారు. నీట్ పేపర్‌లీక్‌పై ఆందోళనల నేపథ్యంలో జులై 25న ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

# అవినీతిపరులపై ఏసిబి ఉక్కుపాదం

## రెండు నెలల్లో పది అక్రమాస్తుల కేసులు నమోదు

హైదరాబాద్, జూలై 28: అవినీతిపై తెలంగాణ ఏసీబీ ఉక్కుపాదం మోపుతుందని, అవినీతిపై రాజీ లేకుండా చర్యలు కొనసాగిస్తామని ఏసీబీ డీజీ చారు సిన్హా స్పష్టం చేశారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30, వరకూ తెలంగాణ ఏసీబీ మొత్తం 10 ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులు, 34 ట్రాప్ కేసులు, 23 ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డు స్థాయిలో కేసులు నమోదు చేసింది. 1983లో ఏసీబీ ప్రారంభమైన తర్వాత ఒకే త్రైమాసికంలో ఇంత భారీ స్థాయిలో కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో ఏసీబీ డీజీ చారు సిన్హా ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి, నమోదైన కేసులు, ట్రాప్ ఆపరేషన్లు, దర్యాప్తు పురోగతి, నిందితులపై తీసుకుంటున్న చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా డీజీ చారు సిన్హా మాట్లాడుతూ..'అధికారుల సమష్టి కృషి, నిబద్ధత వల్లే ఈ రికార్డు సాధ్యమైంది. అవినీతిపై ఏమాత్రం రాజీ లేకుండా మరింత వేగంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తులు కొనసాగించాలని అన్ని యూనిట్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. నిజాయితీ, ప్రజాసేవే ఏసీబీ ప్రధాన లక్ష్యం. అవినీతి నిర్మూలన కోసం ఇదే దూకుడు కొనసాగిస్తాం' అని అన్నారు.

# ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

## ఆగివున్న లారీని ఢీకొన్న కారు.. ప్రమాదంలో యువతీ,యువకుడు మృతి

హైదరాబాద్, జూలై 28: నగరంలోని గచ్చిబౌలి ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. నియోపోలిస్ ఎగ్జిట్ సమీపంలో రోడ్డుపక్కన నిలిచి ఉన్న లారీని.. వెనుక నుంచి అత్యంత వేగంగా వచ్చిన స్విఫ్ట్ కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న యువతీ, యువకుడు వాహనంలోనే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఎంతో శ్రమించి వారిని బయటకు తీశారు. అయితే అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంతో ఔటర్ రింగ్ రోడ్డుపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మృతులను యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన కత్రావత్ సురేందర్ (19), ప్రణీతి రెడ్డిగా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ ఒకే గ్రామానికి చెందినవారని, ప్రణీతి ఎల్‌బీనగర్‌లోని ఏస్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిగా సమాచారం. సోమవారం రాత్రి యాదాద్రి జిల్లా బొమ్మలరామారం నుంచి గండిపేట్ మీదుగా కొల్లూరు వైపు కారులో బయలుదేరిన సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

# సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం





- స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులకు అభినందనలు
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,జూలై28 : అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి నాగ భరత్ డాకా ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భారతదేశంలోనే ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్-క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్-1ను విజయవంతంగా ప్రయోగించిన తీరును వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. సమావేశంలో తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాల పురోగతి, ఆవిష్కరణలు, అధునాతన తయారీ, పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ప్రభుత్వం?ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య సహకార అవకాశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వారు సాధించిన విజయం భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళుతుందని ప్రశంసించారు.

# పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

- గతంలో జరిగిన తప్పులపై వివరణ ఇవ్వాల్సిందే
- మహిళా బిల్లుతో డీలిమిటేషన్ చేర్చి గందరగోళం చేస్తున్నారు
- అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తాం
- మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



న్యూఢిల్లీ,జూలై28 : మంచి ఉద్దేశంతో పరీక్షల సంస్కరణల బిల్లు తీసుకొస్తే బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి స్వాగతిస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొత్త బిల్లులు తీసుకురావడానికి ముందు గత తప్పుల నుంచి ఏమి నేర్చుకుందో ప్రజలకు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఐదుసార్లు పేపర్ లీక్‌లు జరిగాయని.. అందులో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా మూడుసార్లు జరిగాయని వివరించారు. ప్రస్తుతం దేశానికి జవాబుదారీతనం, పారదర్శకత , దీర్ఘకాలిక సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. డా. కె. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల అమలు ఏమైందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే నందన్ నీలేకని కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించింది.. అయితే దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి రాజకీయ గందరగోళం సృష్టించారని విమర్శించారు. డీలిమిటేషన్‌పై ఇప్పటివరకు ప్రభుత్వం ప్రత్యేక బిల్లు తీసుకు రాలేదని వివరించారు. అందుకు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ఉదాహరణ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో లోక్‌సభ స్థానాలు పెంచాలని చట్టంలో ఉన్నప్పటికీ, 12 ఏళ్లుగా అవి అమలు కాలేదన్నారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్నే అమలు చేయని ప్రభుత్వం.. కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని సందేహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 1971 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్‌ను నిలిపివేసి, ఆ తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఆ గడువును పొడిగించిందని వివరించారు. ఈ కాలంలో దక్షిణ భారత రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని.. కానీ ఉత్తర భారతంలోని రాష్ట్రాల్లో జనాభా అధికంగా పెరిగిందని సోదాహరణగా తెలిపారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా స్పష్టత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈసందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. నిన్న హైకోర్టు హైడ్రా అనేది 9 తలల విష సర్పం అని చెప్పింది. ముఖ్యమంత్రి ఇంతకంటే చెంపపెట్టు ముఖ్యమంత్రికి ఏముంటుంది.. సిగ్గుండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేటీఆర్ ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులతోపాటు పలు ఐటీ సంస్థల అంశాలను కేంద్రమంత్రితో చర్చించారు.

అనంతరం ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావుతో కలిసి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. బడాబాబులను మాత్రం వదిలిపెట్టి గరీబోళ్ల ఇండ్ల మీద పడి.. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఇల్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెరువులో ఉంటది. దాన్ని హైడ్రా ముట్టదు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంటది. దాన్ని హైడ్రా ముట్టదు. రాష్ట్ర మంత్రులు వివేక్, శాసనమండలి చైర్మన్ గుత్తు సుఖేందర్ రెడ్డి, రాష్ట్రంలో ఇంకా కీలక నేతలు చాలా మంది బిల్డింగులన్నీ చెరువుల్లో, శిఖాల్లో ఉన్న వాటిని మాత్రం హైడ్రా ముట్టదని కేటీఆర్ అన్నారు. కబ్జాకోరులని ముఖ్యమంత్రి అంటున్నరు. అందరికంటే పెద్ద కబ్జాకోరులే మీ అన్నదమ్ములు కదా.. అందరికంటే ఎక్కువ ఆస్తి దోస్తున్నది.. అందరికంటే ఎక్కువ విధ్వంసం చేస్తున్నది మీ మంత్రులు కదా..? కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టింది నీ మంత్రులు కాదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయిన నాడు రాష్ట్రంలో నిషేధిత భూముల ఎంతంటే మొత్తం 16 లక్షల ఎకరాలు.. ఇవాళ అది కోటి ఎకరాలకు చేరుకుంది. ఏ కారణం చేత కోటి ఎకరాలు పెడుతున్నరు. 30 శాతం కమిషన్ తీసుకోవడం లేదా..? మీ మంత్రులు.. అని ప్రశ్నించారు. కబ్జాకోరులు, భూదందాలు చేసేది.. భూమిని భూహారతిలాగా మింగుతున్నది నీ ప్రభుత్వం, నీ మంత్రులు కాదా..? ప్రజలకు తెల్వదా..? అని అన్నారు. హైడ్రా పేరుతో నువ్వు సృష్టిస్తున్న అరాచకం కొన్ని వేల ఇండ్లు హైదరాబాద్‌లో కూలగొట్టి ఒక ఇటుక పెట్టకుండా.. ఇల్లు కట్టకుండా విధ్వంసం సృష్టించి రియల్ ఎస్టేట్‌ను సృష్టించి నువ్వు డబ్బులు సొమ్ము చేసుకుంటున్నవ్ అంటూ మండిపడ్డారు. పెద్ద పెద్ద బిల్డర్లు ఇవాళ చెరువుల్లో ఇండ్లు, బిల్డింగులు కడుతుంటే నీకు కనబడదు. కానీ ఇవాళ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నవ్. అందుకే మేమనేది హైడ్రా అనేది బ్లాక్‌మెయిలింగ్ ఎక్స్‌టార్షన్ టూల్ ఆఫ్ రేవంత్ రెడ్డి. అందుకే మా ప్రభుత్వం వచ్చిన మొదటి రోజే హైకోర్టు చెప్పిన విధంగా దాన్ని ఎత్తి బంగాళాఖాతంలో పడేస్తామన్నారు. ఒక అధికారి 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు చరిత్రలో ఎక్కడైనా ఉందా..? అని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సోదరుడి ఇల్లు, కాంగ్రెస్ నాయకుల ఫామ్ హౌసులు ఎందుకు కూలగొట్టడం లేదు..? చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఆన్‌లైన్ మోసాలను అరికట్టే చర్యలు

## ఐడీపీఐసీని ఏర్పాటు చేశామన్న ఆర్థికమంత్రి

న్యూఢిల్లీ,జూలై28 : దేశంలో ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు 'ఇండియా డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్ (ఐడీపీఐసీ)' ను ఏర్పాటు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఏఐ వంటి సాంకేతికతను ఉపయోగించి.. బ్యాంకులు, ఆర్థిక సంస్థలను అలర్ట్ చేసేలా దీనిని రూపొందించినట్లు చెప్పారు. సైబర్ మోసాల కట్టడికి తీసుకుంటున్న చర్యలపై రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పెరుగుతున్న సైబర్ ముప్పులను ఎదుర్కొనేందుకు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తున్నాం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తో సంప్రదించి ఐడీపీఐసీని ఏర్పాటు చేశాం. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి అత్యాధునిక సాంకేతికతల సహాయంతో మోసాలను వెంటనే గుర్తించి సంబంధిత విభాగాలకు హెచ్చరికలు జారీ చేస్తుంది. మెటాడేటా స్థాయిలో సైబర్ సెక్యూరిటీ ముప్పులను గుర్తించేందుకు జాతీయ సైబర్ సమన్వయ కేంద్రాన్ని ఇండియన్ కంప్యూటర్ ఎమ్జ్గం÷న్సీ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసింది. అదేవిధంగా సెర్ట్-ఇన్ పర్యవేక్షణలోనే ఆర్థిక రంగానికి ఓ నోడల్ ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేశాం. ఇవి ఎప్పటికప్పుడు భాగస్వామ్యపక్షాలతో సమాచారాన్ని పంచుకుంటాయి. తద్వారా సకాలంలో చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

# సౌకర్యాలు మాకొదిలేయండి

## చదువు సంగతి మీరు చూసుకోండి

## టెన్త్ విద్యార్థులకు మంత్రి లోకేశ్ సూచన



విజయవాడ,జూలై28 : విద్యార్థులకు పదోతరగతి చాలా ముఖ్యం. ఇప్పుడు మంచి మార్కులు తెచ్చుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పన బాధ్యత ప్రభుత్వం చూసుకుంటుంది. మీరు చేయాల్సిందల్లా బాగా చదవడమే' అంటూ మంత్రి నారా లోకేశ్ పదో తరగతి విద్యార్థులకు ఉద్బోధించారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలం పునాదిపాడులో ప్రవాసాంధ్రుడు పోలవరపు మాధవరావు, ఆయన కుటుంబసభ్యులు ఇచ్చిన రూ. 1.20 కోట్ల విరాళంతో నిర్మించిన ప్రభుత్వ హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని లోకేశ్ ప్రారంభించారు. అనంతరం పాఠశాలలోని వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పునాదిపాడు పాఠశాలలోని విద్యార్థులు అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. అద్భుతమైన మౌలిక సౌకర్యాలు, మంచి ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ లెర్నింగ్ అవుట్‌కమ్స్, సమ్మేటివ్, ఫార్మాటివ్ ఎసెస్‌మెంట్స్‌లో పాఠశాల వెనుకబడి ఉండడం ఏంటని ప్రశ్నించారు. లెర్నింగ్ అవుట్‌కమ్స్‌లో కేవలం 0.9శాతం రేటింగ్ సాధించడమేంటన్నారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరు కావడాన్ని పూర్తిగా నివారించాలన్నారు. విద్యా రంగంలో సంస్కరణలు పూర్తయ్యాయని ఫలితాలపై ఇక నుంచి దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విషయంలో మరింత ఎక్కువ దృష్టిపెట్టాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, కామినేని శ్రీనివాస్, వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ అనురాధ, దాత మాధవరావు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ పాలనపై కవిత క్షమాపణలు స్వాగతిస్తున్నాం

- కెసిఆర్ అసెంబ్లీకి వస్తే గౌరవిస్తాం: శ్రీధర్ బాబు



హైదరాబాద్,జూలై28 : బీఆర్ఎస్ పాలనపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత క్షమాపణలు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గత పాలకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయాలని కవితకు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో ఇష్టాగోష్టిగా మాడారు. బీఆర్ఎస్ నేతలు డబుల్ 420 అని అభివర్ణించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావాలని తాము కోరుకుంటున్నామని అన్నారు. అసెంబ్లీకి వస్తే ఆయన మర్యాదకు ఇబ్బంది రానివ్వమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైడ్రా మంచిదని సాధారణ ప్రజలు చెబుతున్నారని తెలిపారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు ర్యాలీ తీస్తున్నారని చెప్పారు. అయితే హైడ్రా విషయంలో హైకోర్టు తీర్పును గౌరవిస్తామని స్పష్టం చేశారు. తాము చెప్పాల్సింది కోర్టుకు చెబుతామని అన్నారు. రాజకీయం కోసమే హైడ్రాకు వ్యతిరేకమైన పిటిషన్లు వేస్తున్నారని ఆరోపించారు. హైడ్రాకి వ్యతిరేకంగా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. కోర్టు పూర్తి తీర్పు ఇంకా రాలేదని గుర్తు చేశారు. మీడియాలో, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని తీసుకెళ్తోందంటూ బీఆర్ఎస్ పార్టీపై మంత్రి శ్రీధర్ బాబు నిప్పులు చెరిగారు.

# పార్టీలైన్ ఎప్పుడూ దాటలేదన్న బోండా

## ఉమ వివరణతో సంతృప్తి చెందిన టిడిపి

అమరావతి,జూలై28 : పార్టీ లైన్‌ను తాను ఎప్పుడూ దాటలేదని.. భవిష్యత్తులోనూ దాటబోనని తెదేపా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశాలను శిరసావహిస్తానని చెప్పారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు కమిటీ ముందు హాజరైన అనంతరం బొండా ఉమా మీడియాతో మాట్లాడారు. ముద్రగడ సంస్మరణ సభకు వెళ్లి వైకాపా నేతలను కలవాల్సి వచ్చింది. ఆ విషయాన్ని విపరీతంగా ట్రోల్ చేశారు. జరిగిన ఘటనను వక్రీకరించారు. ఇదంతా సమన్వయ లోపమే. కొన్ని దుష్టశక్తులు నాపై బురద చల్లాయి. పల్లా శ్రీనివాస్, రామానాయుడుకు వివరణ ఇచ్చా. ఇలాంటివి మరోసారి జరగకుండా చూస్తానని చెప్పానని బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభక హాజరై.. వైసీపీ నేతలను కలిసిన వ్యవహారంపై టీడీపీ నేత బొండా ఉమామహేశ్వరరావు ఇచ్చిన వివరణతో పార్టీ అధిష్ఠానం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ అంశంపై పార్టీ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ముందు బొండా ఉమా హాజరై తన వివరణను అందించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు బొండా ఉమాకు పలు సూచనలు చేసినట్లు సమాచారం. పార్టీలో అంతర్గతంగా చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని వారు ప్రశ్నించారు. కాపు సామాజిక వర్గానికి టీడీపీ చేసిన మేలు, ప్రత్యర్థి పార్టీ చేసిన ద్రోహం గురించి మీకు బాగా తెలుసు కదా? అని మంత్రి నిమ్మల.. బోండా ఉమాతో వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. అయితే ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు హాజరైన విషయాన్ని మాత్రం తాము తప్పుబట్టడం లేదని పల్లా శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు స్పష్టం చేసినట్లు తెలిసింది. అయితే సభ అనంతరం బొండా ఉమా చేసిన వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా



ఉన్నందునే వివరణ కోరాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని తీవ్రంగా విమర్శించిన వ్యక్తులతో సఖ్యతగా కనిపించడం పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేక పోయాయని వారు అభిప్రాయపడ్డారు. అలాగే తమ వ్యాఖ్యలను వక్రీకరించే అవకాశం ఉన్న మీడియా సంస్థలకు ఎందుకు ఇంటర్వ్యూలు ఇచ్చారని కూడా బొండా ఉమాను ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై స్పందించిన బోండా ఉమా.. సమన్వయ లోపం కారణంగానే కొన్ని పరిణామాలు చోటుచేసుకున్నాయని వివరణ ఇచ్చారు. తాను ఎప్పుడూ పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా వ్యవహరించే వ్యక్తిని కాదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బొండా ఉమ వివరణతో సంతృప్తి చెందిన పార్టీ అధిష్టానం ఈ వ్యవహారాన్ని ఇక్కడితో ముగించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



# ట్రంప్‌తో నెతన్యాహు 'రహస్య' భేటీ: ఇరాన్ అంశంపై చర్చ!

**వైట్‌హౌస్‌లో 90 నిమిషాల పాటు సాగిన ఇరు దేశాల అధినేతల చర్చలు**

**ఇరాన్ చేతికి అణుఆయుధం చిక్కకుండా చూడటమే ఉమ్మడి లక్ష్యం: ఇజ్రాయెల్ ప్రధాని**

బలగం టీవీ, న్యూఢిల్లీ

ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో మంగళవారం తొలిసారిగా ముఖాముఖి సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఇరాన్ ఘర్షణల విషయమై బహిరంగంగా వ్యక్తమైన భేదాభిప్రాయాలను పక్కనబెట్టి, సంబంధాలను చక్కదిద్దుకునేందుకు ఇరు దేశాల నేతలు ఈ భేటీని వేదికగా చేసుకున్నారు.

దాదాపు గంటన్నర (90 నిమిషాలు) పాటు అత్యంత రహస్యంగా, మూసివేసిన తలుపుల వెనుక సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా ఇరాన్ యుద్ధం గురించే చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. గత ఫిబ్రవరి చివర్లో అమెరికా-ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై సంయుక్త దాడులు చేయడంతో ఈ యుద్ధం మొదలైంది. అయితే, చర్చలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో వాషింగ్టన్ ప్రస్తుతం తాత్కాలికంగా దాడులను నిలిపివేసింది. కాగా, ఏప్రిల్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఈ నెల ప్రారంభంలో కుప్పకూలడంతో అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ ఘర్షణలు తీవ్రమయ్యాయి. ఈ తాజా పోరాటంలో ఇజ్రాయెల్ నేరుగా పాల్గొనలేదు.

అత్యంత అద్భుతమైన భేటీ: నెతన్యాహు ఆనందం

ట్రంప్‌తో భేటీ ముగిసిన అనంతరం నెతన్యాహు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేస్తూ, ఈ సమావేశాన్ని 'అత్యంత అద్భుతమైనది'గా అభివర్ణించారు. "ఇది ఇరు దేశాల పూర్తి భాగస్వామ్యంతో, పరస్పర మద్దతుతో సాగిన సంభాషణ. ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణు ఆయుధాలను సాధించకుండా నిరోధించడమే మా ఉమ్మడి లక్ష్యం. అమెరికా అధ్యక్షుడు, మన మిత్రుడు డొనాల్డ్ ట్రంప్‌తో నా కెరీర్‌లోనే జరిగిన అత్యుత్తమ సంభాషణల్లో ఇది ఒకటి" అని నెతన్యాహు హర్షం వ్యక్తం చేశారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కారోలిన్ లీవిట్ సైతం ఈ చర్చలు "సానుకూలంగా, ఫలప్రదంగా" సాగాయని పేర్కొన్నారు.

ఎన్నికల పరీక్షల వేళ కీలక భేటీ..

2025 ప్రారంభంలో ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నెతన్యాహుతో జరిగిన ఎనిమిదో భేటీ ఇది. ఈ ఏడాది చివర్లో ఇజ్రాయెల్‌లో జరగబోయే జాతీయ ఎన్నికలు, అమెరికాలో జరగనున్న మధ్యంతర ఎన్నికల (మిడ్‌టర్మ్ పోల్స్) నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

భేటీకి ముందే నెతన్యాహు మాట్లాడుతూ.. "మా ఎజెండాలో అన్ని అంశాల కంటే ముందుగా ఇరాన్ గురించే చర్చిస్తాం. మా భద్రతను కాపాడుకోవడంతో పాటు మా చుట్టూ శాంతి వలయాన్ని విస్తరించడమే మా లక్ష్యం" అని చెప్పారు. కాగా, వాషింగ్టన్ చేరుకున్న నెతన్యాహు, సోమవారం రాత్రి దివంగత యూఎస్ సెనేటర్ లిండ్సే గ్రాహం జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్రైవేట్ విందులో పాల్గొనడంతో పాటు మంగళవారం ఆయన స్మారక సేవకు కూడా హాజరయ్యారు.

సంబంధాలలో ఎలాంటి చీలిక లేదు!

ఇరాన్ కాల్పుల విరమణ చర్చల సమయంలో ట్రంప్, నెతన్యాహుల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారనే వార్తల నేపథ్యంలో.. ఇజ్రాయెల్ అంతర్జాతీయ నిపుణులు దీనిని ఖండించారు. జెరూసలేంలోని హీబ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ యోనాటన్ ఫ్రీమాన్ మాట్లాడుతూ.. "ఈ పర్యటన యొక్క ముఖ్య ఉద్దేశం ఇరు దేశాల మధ్య బంధం బలహీనపడిందనే ప్రచారానికి అడ్డుకట్ట వేయడమే. అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఎలాంటి చీలిక లేదా పెద్ద విభేదాలు లేవని ఇరాన్, లెబనాన్‌లకు స్పష్టం చేయడమే ఈ భేటీ ప్రధాన లక్ష్యం" అని విశ్లేషించారు. అలాగే ట్రంప్ ప్రస్తుతం గాజా పునర్నిర్మాణం కంటే తన ప్రాధాన్యత అంశాలైన ఇరాన్ వ్యూహాలు, అబ్రహం ఒప్పందాల విస్తరణపైనే ఎక్కువ దృష్టి సారించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# జపాన్‌లో భారీ భూకంపం: 7.1 తీవ్రత!

**కుమామోటో ప్రాంతంలో బలమైన ప్రకంపనలు.. సునామీ హెచ్చరికలు జారీ**

**బుల్లెట్ రైళ్ల నిలిపివేత.. చైనాలోనూ 18 నిమిషాల వ్యవధిలో రెండుసార్లు కంపించిన భూమి**

బలగం టీవీ, టోక్యో



జపాన్ దక్షిణ ప్రధాన ద్వీపమైన క్యూషులోని కుమామోటో ప్రాంతంలో మంగళవారం భారీ భూకంపం సంభవించింది. ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో నమోదైందని జపాన్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. సముద్ర ఉపరితలానికి కేవలం 10 కిలోమీటర్ల లోతులోనే ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భారీ భూకంపం కారణంగా జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

అత్యవసర హెచ్చరికలు.. రంగంలోకి టాస్క్‌ఫోర్స్ భూకంప తీవ్రత దృష్ట్యా నాగసాకి, కగోషిమా, సాగా, ఓయిటా, మియాజాకి ప్రాంతాలకు జపాన్ ప్రభుత్వం అత్యవసర భూకంప హెచ్చరికలను జారీ చేసింది. తీర ప్రాంత ప్రజలందరూ వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు ఆదేశించారు. కాగా, నష్ట తీవ్రతను తక్షణమే అంచనా వేయాలని జపాన్ ప్రధానమంత్రి కార్యాలయం అధికారులను ఆదేశించడమే కాకుండా, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. రక్షణ మంత్రిత్వ శాఖ సైతం క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేయడానికి ఆ ప్రాంతంలోకి ప్రత్యేక విమానాలను పంపింది.

3 అడుగుల మేర సునామీ ముప్పు: ప్రధాని సనాయే తకాయిచి భూకంపం కారణంగా సముద్రంలో మూడు అడుగుల మేర సునామీ వచ్చే అవకాశం ఉందని జపాన్ ప్రధానమంత్రి సనాయే తకాయిచి సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. తీర ప్రాంత ప్రజలు వెంటనే ఎత్తైన ప్రదేశాలకు వెళ్లిపోవాలని ఆమె కోరారు. ఇంకా బలమైన ప్రకంపనలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ప్రజల భద్రతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. మరోవైపు భద్రతా కారణాల దృష్ట్యా క్యూషూ పరిధిలో నడిచే బుల్లెట్ రైళ్లతో పాటు స్థానిక రైలు సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు.

భూకంపాల పుట్ట జపాన్.. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా భూకంపాలు సంభవించే దేశాల్లో జపాన్ ఒకటి. ప్రపంచవ్యాప్తంగా వచ్చే భూకంపాల్లో దాదాపు 18 శాతం ఈ ద్వీపసమూహంలోనే సంభవిస్తాయి. సుమారు 125 మిలియన్ల జనాభా ఉన్న జపాన్‌లో ప్రతి ఏటా వందలాది భూకంపాలు వస్తుంటాయి.

2011: జపాన్ చరిత్రలోనే అత్యంత ఘోరంగా 9.0 తీవ్రతతో వచ్చిన భూకంపం, సునామీ వల్ల సుమారు 18,500 మంది మరణించారు.

2016: కుమామోటో ప్రాంతాన్ని తాకిన భూకంపం వల్ల 50 మందికి పైగా మరణించగా, 1,800 మంది గాయపడ్డారు.

ఈ ఏడాది ఏప్రిల్ 20: దేశ ఉత్తరాదిలో 7.7 తీవ్రతతో వచ్చిన భూకంపానికి 10 మంది గాయపడ్డారు.

ఈ ఏడాది జూన్ 25: ఉత్తర జపాన్‌లో 7.2 తీవ్రతతో భూకంపం వచ్చినా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

చైనాలో 18 నిమిషాల వ్యవధిలో రెండుసార్లు.. ఇదిలా ఉండగా, జపాన్ పొరుగు దేశమైన చైనాలోని మారుమూల ప్రావిన్స్‌లో సైతం మంగళవారం ఉదయం వరుస భూకంపాలు కలకలం రేపాయి. కింఘై ప్రావిన్స్‌లో ఉదయం 11:16 గంటలకు, ఆ తర్వాత 11:34 గంటలకు అంటే కేవలం 18 నిమిషాల వ్యవధిలోనే రెండు భారీ ప్రకంపనలు నమోదైనట్లు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (USGS) పేర్కొంది. రిక్టర్ స్కేలుపై వీటి తీవ్రత వరుసగా 5.7, 5.8గా నమోదైందని, ఇవి కూడా భూమికి 10 కిలోమీటర్ల లోతులో సంభవించాయని తెలిపింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# బీసీ సంక్షేమ భవనం ముట్టడి ఉద్రిక్తం..!

**బీసీ గురుకులాల్లో అదనంగా 20 సీట్లు పెంచాలి: బూర్గుపల్లి కృష్ణ యాదవ్**

**మసాబ్ ట్యాంక్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల భారీ ధర్నా.. ప్రవేశ పరీక్షల రద్దుకు డిమాండ్**

బలగం టీవీ, హైదరాబాద్

తమ పిల్లలకు బీసీ గురుకులాల్లో సీట్లు కేటాయించాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్ వద్ద ఉన్న బీసీ గురుకుల సెక్రటరీ కార్యాలయం ముట్టడి ఉద్రిక్తంగా మారింది. బీసీ జాగృతి సేన, బీసీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యాలయం సమీపంలో భారీ ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణవ్యాప్తంగా మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో సీట్లకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న గురుకులాల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి తరగతిలో అదనంగా 20 సీట్లు పెంచి వెంటనే ప్రవేశాలు కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని బలంగా డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో పోటీ చేసేవారికే పరీక్షలు పెట్టాలి! రాష్ట్రంలో బీసీ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా మరో 150 కొత్త బీసీ గురుకుల పాఠశాలలను తక్షణమే ఏర్పాటు చేయాలని కృష్ణ యాదవ్ కోరారు. గురుకుల సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద విద్యార్థికి ప్రవేశం కల్పించాలన్నారు. ప్రస్తుతం గురుకుల ప్రవేశానికి అమలు చేస్తున్న ఎంట్రన్స్ (ప్రవేశ పరీక్ష) విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన రాజకీయ నాయకులపై విమర్శలు గుప్పిస్తూ.. "అసలు పరీక్షలు నిర్వహించాల్సింది చిన్న పిల్లలకు కాదు.. వార్డు సభ్యుడి నుంచి పార్లమెంట్ సభ్యుడి వరకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పరీక్షలు పెట్టాలి. అప్పుడే వారికి సమాజంపై, అభివృద్ధిపై కనీస అవగాహన పెరుగుతుంది" అని వ్యాఖ్యానించారు.

ధర్నాలో భారీగా పాల్గొన్న నేతలు.. ఈ ముట్టడి కార్యక్రమంలో బీసీ జాగృతి సేన, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, బీసీ విద్యార్థులు, పేద విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాలో పాల్గొన్న వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్, ఎడ్ల కురుమయ్య, విద్యార్థి సంఘం నాయకులు రాకేష్ దత్త, సందీప్ యాదవ్, రాములు, మహేష్ తదితరులు ఉన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# నేడు భవన నిర్మాణ కార్మికుల రౌండ్ టేబుల్ సమావేశం

**విద్యానగర్ మార్క్స్ భవన్‌లో నిర్వహణ.. హాజరుకానున్న పలు కార్మిక సంఘాల నేతలు**

**ప్రైవేట్ ఏజెన్సీల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్.. ప్రచురణకు సంఘం నేతల విజ్ఞప్తి**

బలగం టీవీ, హైదరాబాద్

భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బుధవారం (జూలై 29న) నగరంలో ఒక ముఖ్యమైన రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. తెలంగాణ ప్రగతిశీల భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం (H-74 - టీయూసీఐ అనుబంధం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని 'మార్క్స్ భవన్'లో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంయుక్త రౌండ్ టేబుల్ సమావేశానికి టీయూసీఐ (TUCI), సీఐటీయూ (CITU), ఏఐటీయూసీ (AITUC), ఐఎఫ్టీయూ (IFTU), టీఎఫ్టీయూ (TFTU), స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం, సెంటరింగ్ కార్మిక సంఘంతో పాటు పలు ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్మిక నేతలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమ పథకాల అమలులో జరుగుతున్న లోపాలు, హక్కుల పరిరక్షణ, భవిష్యత్ ఉమ్మడి పోరాట కార్యాచరణపై విస్తృతంగా చర్చించనున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

సమావేశంలో చర్చించబోయే కీలక డిమాండ్లను సంఘం నేతలు ఈ క్రింది విధంగా వెల్లడించారు:

కార్మిక సంక్షేమ పథకాల అమలును ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారానే అన్ని రకాల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా లబ్ధిదారులకు చేర్చాలి.

విధి నిర్వహణలో కాకుండా సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలి.

సీఎస్సీ (CSC) ద్వారా కార్మికులకు నిర్వహిస్తున్న అనవసరపు హెల్త్ టెస్టుల విధానాన్ని తక్షణమే నిలిపివేయాలి.

60 సంవత్సరాల వయసు దాటిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి నెలవారీ పెన్షన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలి.

సొంత ఇల్లు లేని అర్హులైన భవన నిర్మాణ కార్మికులందరికీ ప్రాధాన్యత క్రమంలో 'ఇందిరమ్మ ఇళ్లను' మంజూరు చేయాలి.

బోర్డులో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి.

మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి.. కార్మికుల న్యాయమైన సమస్యలపై జరుగుతున్న ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు డిజిటల్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కవరేజ్ ఇవ్వాలని, తద్వారా శ్రమజీవుల గొంతుకను ప్రభుత్వానికి వినిపించేలా సహకరించాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. హన్మేష్ (9441162844), రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఎస్. ప్రదీప్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# పీవోకేలో ఆందోళనకారులపై కాల్పులు

**పాక్ చర్యను సమర్థించిన పాక్ రక్షణ మంత్రి.. భారత్ తీవ్ర ఖండన**

బలగం టీవీ, హైదరాబాద్

పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో ఆందోళనకారులపై భద్రతా బలగాలు జరిపిన కాల్పులు ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రజలపై కాల్పులు జరపడాన్ని పాకిస్తాన్ ప్రభుత్వం సమర్థించగా, రక్షణ శాఖ మంత్రి ఖవాజా అసిఫ్ ఆందోళనకారులు పాకిస్తాన్‌కు భారత్‌లాగే శత్రువులని వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది.పీవోకేలో జూన్ 5 నుంచి పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. పాకిస్తాన్ నుంచి విముక్తి కల్పించి స్వాతంత్ర్యం ఇవ్వాలని లేదా తమ డిమాండ్లను అమలు చేయాలని ఉద్యమకారులు కోరుతున్నారు.

సోమ, మంగళవారాల్లో రావల్‌కోట్, మీర్పూర్ ప్రాంతాల్లో వేలాదిమంది ఆందోళనలకు దిగగా, భద్రతా బలగాలు కాల్పులకు దిగినట్లు సమాచారం. రెండు రోజుల్లోనే సుమారు 25 మంది వరకు మృతిచెందినట్లు వార్తలు వెలువడ్డాయి. తాజా ఆందోళనలు ప్రారంభమైనప్పటి నుంచి 80 మందికిపైగా మరణించగా, వందలాది మంది గాయపడినట్లు తెలుస్తోంది.

ఈ ఘటనలపై స్పందించిన పాక్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్.. ఆందోళనకారులు పాకిస్తాన్‌కు భారత్‌లాగే శత్రువులని పేర్కొంటూ భద్రతా బలగాల చర్యలను సమర్థించారు.

మరోవైపు, తమ ప్రాథమిక హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలపై ప్రభుత్వం హింసకు పాల్పడుతోందని ఆందోళనకారులు ఆరోపిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ మీడియా ఈ ఘటనలపై మౌనం పాటిస్తోందని వారు విమర్శించారు. కాల్పుల్లో మృతిచెందిన వారి మృతదేహాలు వీధుల్లో కనిపిస్తున్నాయని, గాయపడిన వారిని ప్రజలే భుజాలపై మోసుకెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీవోకేలో అమాయక ప్రజలపై కాల్పులు జరపడం పట్ల భారత్ తీవ్రంగా స్పందించింది. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లో ప్రజలపై భద్రతా బలగాలు జరిపిన కాల్పులను ఖండిస్తూ, అమాయకులపై క్రూరత్వానికి పాల్పడటం ఆందోళనకరమని పేర్కొంది.

# సైబర్ నేరగాళ్లకు మరణశిక్ష!

**'ఆన్‌లైన్ మోసాల నిరోధక బిల్లు'కు మయన్మార్ చట్టసభ ఆమోదం**

**బాధితులను నిర్బంధించి, హింసిస్తే కఠిన చర్యలు.. ముఠాల వలలో చిక్కుకున్న 100 మంది తెలుగు విద్యార్థులు**

బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్న సైబర్ మోసాల (Cyberscam Offences) ను అరికట్టడానికి మయన్మార్ సర్కారు అత్యంత కీలకమైన ముందడుగు వేసింది. సైబర్ నేరం కేసుల్లో దోషులుగా తేలిన వారికి ఏకంగా మరణశిక్ష (Death Sentence) విధించేలా రూపొందించిన చారిత్రాత్మక 'ఆన్‌లైన్ మోసాల నిరోధక బిల్లు'కు (Anti-Online Scam Bill) ఆ దేశ చట్టసభ ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాజధాని నేపిడోలో జరిగిన ఉభయ సభల సంయుక్త సమావేశంలో ఈ బిల్లుకు ఆమోదముద్ర పడినట్లు మయన్మార్ పార్లమెంట్ స్పీకర్ ఆంగ్ లిన్ ద్వే (Aung Lin Dwe) అధికారికంగా వెల్లడించారు.

హింసించినా, మరణానికి కారణమైనా ఉరిశిక్షే!

సైబర్ నేరగాళ్లు అమాయక బాధితులను ఉద్యోగాల పేరుతో రప్పించి, వారిని నిర్బంధించినా లేదా శారీరకంగా హింసించినా ఈ కొత్త చట్టం కింద అత్యంత కఠినమైన చర్యలు తీసుకోనున్నట్లు స్పీకర్ ఆంగ్ లిన్ ద్వే స్పష్టం చేశారు. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా ఇతరులను బలవంతపెట్టడం, అక్రమంగా నిర్బంధించడం వంటి నేరాలకు 10 ఏళ్ల నుంచి జీవిత ఖైదు వరకు విధిస్తామని తెలిపారు. ఒకవేళ ఈ సైబర్ ముఠాల వేధింపులు, హింస కారణంగా బాధితులు మరణిస్తే.. సదరు నేరగాళ్లకు ఖచ్చితంగా మరణశిక్షే విధిస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే సైబర్ స్కామ్ కేంద్రాలను నడిపేవారికి, క్రిప్టో కరెన్సీ మోసాలకు పాల్పడే వారికి గరిష్టంగా జీవిత ఖైదు పడుతుందని చట్టంలో పొందుపరిచారు.

తెలుగు యువతే లక్ష్యంగా ముఠాల ఘాతుకం..

కొందరు అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ప్రకటనలు గుప్పిస్తూ, విదేశాలలోని ఐటీ విద్యార్థులను మయన్మార్‌కు రప్పిస్తున్నారని స్పీకర్ తెలిపారు. అనంతరం వారిని బెదిరించి సైబర్ నేరాలు చేసేలా అక్రమంగా మారుస్తున్నారని, దీనిపై ప్రపంచవ్యాప్తంగా అనేక ఫిర్యాదులు అందాయన్నారు.

ఇటీవల సింగపూర్‌లో ఐటీ ఉద్యోగాల ఆశ చూపి.. తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 100 మంది యువతను సైబర్ ముఠాలు తమ వలలో వేసుకున్న ఘోర ఉదంతం వెలుగులోకి వచ్చింది. సింగపూర్‌కు తీసుకువెళ్తామని నమ్మించి వారిని మయన్మార్‌లోని సైబర్ క్యాంపులకు తరలించారు. అనంతరం వారి పాస్‌పోర్ట్‌లు, ఇతర కీలక పత్రాలను లాక్కుని బందీలుగా మార్చారు. నిరంతరం నిఘా నీడలో ఉంచుతూ, బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తూ హింసించారు.

కేంద్ర విదేశాంగ శాఖ రంగంలోకి..

బాధితులు ఎలాగోలా రహస్యంగా ఫోన్ల ద్వారా తమ కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ఆందోళనకు గురైన బాధితుల కుటుంబసభ్యులు జూలై 17న భారత కేంద్ర విదేశాంగ శాఖకు ఆన్‌లైన్ ద్వారా అత్యవసర ఫిర్యాదు చేశారు. మయన్మార్‌లో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి రప్పించడానికి, అక్కడ ఉన్న భారత రాయబార కార్యాలయం ద్వారా అధికారులు ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు.

# చైనా 'కృత్రిమ సూర్యుడు' విజయవంతం!

**న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రాజెక్ట్‌లో భారీ సూపర్ కండక్టింగ్ అయస్కాంతం పరీక్ష సక్సెస్**

**100 మిలియన్ డిగ్రీల ప్లాస్మాను నియంత్రించే సాంకేతికత.. 2030 నాటికి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం**

బలగం టీవీ, హైదరాబాద్



భూమిపై సూర్యుడి తరహాలోనే స్వచ్ఛమైన, అపరిమితమైన ఇంధనాన్ని సృష్టించే దిశగా చైనా శాస్త్రవేత్తలు సరికొత్త చరిత్ర సృష్టించారు. చైనా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆర్టిఫీషియల్ సన్' (కృత్రిమ సూర్యుడు) ప్రాజెక్ట్‌కు సంబంధించి అత్యంత కీలకమైన భారీ సూపర్ కండక్టింగ్ అయస్కాంతాన్ని (Superconducting Magnet) శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. భవిష్యత్తులో ప్రపంచ ఇంధన అవసరాలను తీర్చే అపరిమిత విద్యుత్ ఉత్పత్తి రంగానికి ఈ ప్రయోగం ఒక మైలురాయిగా నిలుస్తుందని గ్లోబల్ సైన్స్ నిపుణులు కొనియాడుతున్నారు. 2030 నాటికి కేంద్రక సంలీనం (న్యూక్లియర్ ఫ్యూజన్) ప్రక్రియ ద్వారా వాణిజ్యపరంగా విద్యుత్తును ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా చైనా ఈ అడుగులు వేస్తోంది.

ఏమిటీ కేంద్రక సంలీనం? అంతరిక్షంలోని నిజమైన సూర్యగోళం నుంచి నిరంతరం ఊహించని శక్తి విడుదల కావడానికి గల కారణం.. అక్కడ ఉండే హైడ్రోజన్ పరమాణువులు ఒకదానికొకటి అత్యంత వేగంతో ఢీకొని విపరీతమైన శక్తిని, ఉష్ణోగ్రతను విడుదల చేయడమే. ఈ శాస్త్రీయ ప్రక్రియనే 'కేంద్రక సంలీనం' లేదా 'న్యూక్లియర్ ఫ్యూజన్' అంటారు. ఎలాంటి కాలుష్యం లేని ఈ సూర్య ప్రక్రియను భూమిపై కృత్రిమ పరిస్థితుల మధ్య రీ-క్రియేట్ చేయడంలో చైనా శాస్త్రవేత్తలు అద్భుతమైన ఇంజినీరింగ్ విజయాన్ని అందుకున్నారు.

582 టన్నుల బరువు.. 100 మిలియన్ డిగ్రీల వేడి! చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిధిలోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్' శాస్త్రవేత్తలు ఈ అద్భుత ఘనతను సాధించారు. ఈ ప్రయోగ విశేషాలు ఇలా ఉన్నాయి:

భారీ నిర్మాణం: శాస్త్రవేత్తలు 21 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో ఆంగ్ల అక్షరం 'డీ' (D) ఆకారంలో ఉండే ఒక భారీ సూపర్ కండక్టింగ్ అయస్కాంతాన్ని డిజైన్ చేశారు.

భారీ బరువు: దాదాపు 582 టన్నుల బరువుండే ఈ అయస్కాంతం.. రియాక్టర్‌లో కేంద్రక సంలీనం జరిగిన తర్వాత వెలువడే ఏకంగా 100 మిలియన్ డిగ్రీల సెల్సియస్ అత్యధిక ఉష్ణోగ్రత గల 'ప్లాస్మా'ను నియంత్రిస్తుంది.

రక్షణ కవచం: అత్యంత శక్తివంతమైన అణు రియాక్టర్ గోడలను ఈ భయంకరమైన వేడి ప్లాస్మా తాకకుండా ఈ అయస్కాంత క్షేత్రం రక్షణ కవచంలా కాపాడుతుంది.

సూర్యగోళంలో నిత్యం జరిగే చర్యలకు నమూనాగా నిలిచే ఈ ప్రాజెక్ట్‌లో.. అత్యంత సంక్లిష్టమైన 'హై టెంపరేచర్ సూపర్ కండక్టింగ్ సెంట్రల్ సోలనోయిడ్ కాయిల్స్'ను తాజాగా విజయవంతంగా టెస్ట్ చేశారు. అయితే, ఈ కృత్రిమ సూర్యుడిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు భవిష్యత్తులో ఇంకా అనేక సాంకేతిక సవాళ్లను అధిగమించాల్సి ఉందని పరిశోధకులు స్పష్టం చేశారు.

# జాన్సన్ అండ్ జాన్సన్‌పై 15 ఏండ్ల కేసుకు ముగింపు?

**76 వేల మందికి రూ.52,663 కోట్ల పరిహారం చెల్లించేందుకు కంపెనీ సిద్ధం**

బలగం టీవీ, హైదరాబాద్




ప్రపంచ ప్రఖ్యాత ఆరోగ్య సంరక్షణ సంస్థ జాన్సన్ అండ్ జాన్సన్ (జె అండ్ జె) బేబీ టాల్కమ్ పౌడర్‌పై 15 ఏండ్లుగా కొనసాగుతున్న వ్యాజ్యానికి ముగింపు పలికే దిశగా కీలక అడుగు వేసింది. బేబీ పౌడర్ వినియోగం వల్ల క్యాన్సర్ బారిన పడ్డామని ఆరోపిస్తూ కేసులు వేసిన సుమారు 76 వేల మందికి 5.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.52,663 కోట్లు) పరిహారం చెల్లించేందుకు కంపెనీ అంగీకరించింది. బాధితుల్లో 95 శాతం మంది అంగీకరిస్తే ఈ వివాదానికి తెరపడే అవకాశం ఉందని తెలుస్తోంది.

15 ఏండ్లుగా కొనసాగుతున్న వ్యాజ్యం

అమెరికాలో జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ టాల్కమ్ పౌడర్‌ను ఉపయోగించడం వల్ల అండాశయ క్యాన్సర్ (ఓవేరియన్ క్యాన్సర్) వచ్చిందని ఆరోపిస్తూ వేలాది మంది వినియోగదారులు 15 ఏండ్ల క్రితం కోర్టును ఆశ్రయించారు. టాల్కమ్ పౌడర్‌లో క్యాన్సర్‌కు కారణమయ్యే ఆస్బెస్టాస్ రసాయనం ఉందని వారు ఆరోపించారు.

అయితే తమ ఉత్పత్తులు సురక్షితమైనవేనని, ఆస్బెస్టాస్ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని కంపెనీ ఇప్పటికీ వాదిస్తోంది. అయినప్పటికీ దశాబ్దకాలంగా సాగుతున్న న్యాయపోరాటానికి ముగింపు పలికేందుకు పరిహారం చెల్లించేందుకు ముందుకొచ్చినట్లు తెలిపింది.

2028 నాటికి చెల్లింపులు పూర్తి

ఈ ఏడాదిలోనే 3 బిలియన్ డాలర్లు చెల్లించి, మిగిలిన మొత్తాన్ని 2028 నాటికి పూర్తి చేస్తామని కంపెనీ వెల్లడించింది. పరిహారానికి అంగీకరించే బాధితుల సంఖ్యను బట్టి మొత్తం చెల్లింపు 7 బిలియన్ డాలర్లకు మించి వెళ్లే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.

కార్పొరేట్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘకాలం కొనసాగిన, అత్యధిక పరిహారం చెల్లించే కేసుల్లో ఒకటిగా జాన్సన్ అండ్ జాన్సన్ టాల్కమ్ పౌడర్ వ్యాజ్యం నిలిచింది. ప్రస్తుతం కంపెనీ ప్రతిపాదనకు బాధితుల స్పందనపై కేసు భవిష్యత్తు ఆధారపడి ఉంది.

# తెలుగు రాష్ట్రాల్లో మహిళల్లో పెరుగుతున్న బ్యాడ్మింటన్ క్రేజ్

**2020తో పోలిస్తే మూడింతలు పెరిగిన క్రీడాకారిణులు.. సర్వే వివరాలు మంత్రి లోకేశ్‌కు అందజేత**

బలగం టీవీ, హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ ఆడే మహిళల సంఖ్య గత ఐదేండ్లలో గణనీయంగా పెరిగినట్లు తాజా సర్వే వెల్లడించింది. భారత్‌లో మహిళల క్రీడలపై నిర్వహించిన సర్వే వివరాలను బీబీసీ న్యూస్ తెలుగు అసిస్టెంట్ ఎడిటర్ అనిల్ కుమార్, కలెక్టివ్ న్యూస్‌రూమ్ బృందం ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు.సర్వే ప్రకారం.. 2020లో తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ ఆడే మహిళల శాతం కేవలం 3 శాతంగా ఉండగా, ప్రస్తుతం అది 9 శాతానికి పెరిగినట్లు వెల్లడైంది. ఐదేండ్ల వ్యవధిలో మహిళల భాగస్వామ్యం మూడింతలు పెరగడం విశేషమని సర్వేలో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సర్వే ఫలితాలపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రీడాకారులకు, ముఖ్యంగా యువతులకు మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు ఆధునిక క్రీడా మౌలిక వసతులు, మెరుగైన శిక్షణ, బలమైన మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.క్రీడల్లో రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రతి అమ్మాయికి ప్రోత్సాహం అందించి, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అన్ని విధాలుగా సహకరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**వివిధ శాఖల అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం**

బలగం టివి,రాజన్న సిరిసిల్ల:

మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, డ్రగ్స్ వినియోగం నివారణ, అక్రమ రవాణా కట్టడి, యువతలో అవగాహన కల్పించే అంశాలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, నమోదైన ఎన్డీపీఎస్ కేసులు, గంజాయి సాగు, రవాణా, విక్రయాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగించాలని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ డ్రగ్స్




నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని గుర్తించి, వారికి అవసరమైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించడంతో పాటు, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి హిమశ్రీ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, మున్సిపల్, విద్యా శాఖ, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష..



బలగం టీవీ, సిరిసిల్ల:

బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడు బుర్రా చంద్రశేఖర్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.

సిరిసిల్ల పట్టణానికి చెందిన బుర్రా చంద్రశేఖర్ ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడగా, బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల మొత్తం 15 మంది సాక్షులను కోర్టు ముందు హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్ వాదనలు వినిపించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడి నేరం రుజువైందని నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించింది.

పోక్సో కేసుల్లో జిల్లా పోలీసులు సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహిస్తూ, ప్రాసిక్యూషన్‌తో సమన్వయంగా వేగవంతమైన విచారణ చేపట్టడం వల్ల నిందితులకు వరుసగా కఠిన శిక్షలు పడుతున్నాయని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. నేరం చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, కఠిన శిక్షల

**- సమర్థ దర్యాప్తును అభినందించిన జిల్లా ఎస్పీ..**
**- పోక్సో నేరాలపై జిల్లా పోలీసుల ఉక్కుపాదం.**
**-పోక్సో కేసులలో దర్యాప్తు ముమ్మరం..**
**నిందుతులకు వరుస కఠిన శిక్షలు.**
**- సమర్థ దర్యాప్తు.. వేగవంతమైన విచారణ..**
**- నిందుతుని శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను, పిపి, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

ద్వారానే సమాజంలో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్పష్టం చేశారు.

ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి విచారణ అధికారి డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్, కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెలలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# మండలంలో ఎస్ఐఆర్ ప్రత్యేక పరిశీలన

**ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకూడదు**

**వైద రామానుజం**

బలగం టీవీ, బోయినిపల్లి;

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల భారతీయ జనతా పార్టీ శాఖ అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ మరియు ఎస్ఐఆర్ ప్రవాస్ యోజన మండల ఇన్‌చార్జ్ వైద రామానుజం మండల కేంద్రంలో ఎస్ఐఆర్ ప్రత్యేక పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా పలు బూత్‌లను సందర్శించి, సంబంధిత బీఎల్ఓ అధికారులతో సమావేశమై, ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటివరకు ఎలా కొనసాగిందో సమీక్షించారు. అలాగే ఆగస్టు 3వ తేదీలోపు ప్రత్యేక సవరణ ప్రక్రియను పూర్తిచేసి, అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితా నుంచి తప్పిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అనంతరం సంబంధిత ఎన్నికల అధికారులను కలిసి, ఆయా గ్రామాలలో బూత్ ల సంఖ్యను పరిశీలించి, అవసరమైన చోట నమోదును పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రధాన కార్యవర్గంతో పాటు శక్తి కేంద్రాల ఇంచార్జీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రతి ఇంటికి



చేరుకోవాలని, ప్రతి అర్హుడైన ఓటరుని ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని, ఏ ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యవర్గ సభ్యులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

### క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో

# ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం..



**- శ్రామిక కార్మిక వర్గాలు, వ్యవసాయ కూలీలు,మరి యు ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలి..**
**- తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం ఆధ్వర్యంలో కరపత్రం విడుదల..**
**- ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలి..**
**- రోజువారి వేతనం 600 రూపాయలు చెల్లించాలి..**
**- మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి..**
**- "వికసిత్ భారత్ గ్రామ్ జి"చట్టాన్ని రద్దు చేయాలి..**

బలగం టీవీ, బోయినిపల్లి;

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలో పత్రిక సమావేశం సందర్భంగా వచ్చే నెల 10, తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద, జైల్ భారో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరుగుతుంది.

కేంద్రంలో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో ఉన్నప్పుడు వామపక్షాల పోరాట తంగా"మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం"అమలు చేయబడ్డది. పోరాడి సాధించుకున్న వందరోజుల పనిని ఈరోజు కేంద్రంలో ఉన్న యూనియన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించి దీని స్థానంలో"వికసిత్ భారత్ గ్రామ్, జీ"(వి బి జి,రామ్ జీ) మార్పు చేయడమే కాక, రాష్ట్రాల వాటా 10, శాతం నుండి,40 శాతం నిధులను భరించాలని రాష్ట్రాల మీద భారం రు ద్ధాలని,కేంద్ర ప్రభుత్వం ఇదే అదునుగా భావించి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ 100 రోజుల పనిని ఎత్తివేయాలని కుట్రలు చేస్తుంది. ఈ కుట్రలు తిప్పి కొట్టడానికి వచ్చేనెల ఆగస్టు 10, తేదీన సోమవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తలపెట్టిన జైల్ భరో కార్యక్రమానికి పెద్ద ఎత్తున వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ ,కూలీలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం పిలుపునివ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గురిజాల శ్రీధర్, మరియు రత్నంపేట గ్రామస్తులు రామంచ ప్రభాకర్, గోల్కొండ దేవయ్య, పర్లపల్లి అంజయ్య, ర్యాగల మొండయ్య, అత్తిన ఎర్రయ్య, బూత్కూరు రేణుక, గోండ జ్యోతి, మేర భాగ్య, అత్తేన లచ్చవ్వ, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో 55 అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల..

**జూలై 28 నుంచి ఆగస్టు 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**

బలగం టీవీ, హైదరాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మహిళా, పిల్లలు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లాలోని ఐసీడీఎస్ సిరిసిల్ల ప్రాజెక్టు పరిధిలో 43, వేములవాడ ప్రాజెక్టు పరిధిలో 12 పోస్టులు కలిపి మొత్తం 55 అంగన్‌వాడీ టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. స్థానిక అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి 2026 జూలై 28 ఉదయం 11.30 గంటల నుంచి ఆగస్టు 7 సాయంత్రం 5.00 గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తారు. అభ్యర్థులు https://mis.tgwdcw.in/ వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించారు.

అర్హతలు : అభ్యర్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణురాలై ఉండాలి. 2026 జూలై 1 నాటికి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. దరఖాస్తు చేసే అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధిత గ్రామపంచాయతీ లేదా పట్టణ వార్డుకు స్థానిక వాస్తవ్యురాలై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ సబ్‌ప్లాన్ పోస్టులకు సంబంధిత హామ్లెట్, ఆవాసం లేదా గ్రామపంచాయతీకి చెందిన వారే అర్హులు. నోటిఫికేషన్ తేదీ నుంచి ఏడాది లోపు తహసీల్దార్ జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి.

ఎంపిక విధానం: ఇంటర్మీడియట్ మార్కులకు 70 మార్కులు, వితంతువులకు 5 మార్కులు, అనాథలకు 10 మార్కులు, దివ్యాంగులకు 5 మార్కులు, జిల్లా ఎంపిక కమిటీ ఇంటర్వ్యూకు 10 మార్కులు కేటాయించి మొత్తం 100 మార్కుల ఆధారంగా ఎంపిక చేపడతారు.

**అప్‌లోడ్ చేయాల్సిన ధ్రువపత్రాలు:**

ఎస్ఎస్‌సీ జనన తేదీ ధ్రువీకరణ పత్రం, తహసీల్దార్ జారీ చేసిన కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్ లేదా అంతకంటే పై విద్యార్హతల మార్కుల మెమోలు, ఒక సంవత్సరం లోపు అప్‌డేట్ చేసిన ఆధార్ లేదా ఓటర్ ఐడీ, ప్రత్యేక కేటగిరీలకు సంబంధించిన సదరం సర్టిఫికేట్, భర్త మరణ ధ్రువీకరణ పత్రం లేదా అనాథ ధ్రువీకరణ పత్రాన్ని స్కాన్ కాపీల రూపంలో అప్‌లోడ్ చేయాలి.

అభ్యర్థులు కేవలం ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకుంటామని, మాన్యువల్ దరఖాస్తులు లేదా గతంలో సమర్పించిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబడవని అధికారులు స్పష్టం చేశారు. దరఖాస్తు రశీదును భద్రపరచుకుని ధ్రువపత్రాల పరిశీలన సమయంలో సమర్పించాలని సూచించారు.

నోటిఫికేషన్‌లో అవసరమైతే మార్పులు, సవరణలు చేయడం, పోస్టుల సంఖ్యను పెంచడం లేదా తగ్గించడం, అలాగే ఇతర పరిపాలనా నిర్ణయాలు తీసుకునే పూర్తి అధికారం జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్/చైర్మన్, జిల్లా స్థాయి అంగన్‌వాడీ నియామక కమిటీకి ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.




## కార్గిల్ వీరులకు బీఆర్ఎస్వి ఘన నివాళి..

**– విజయ్ దివస్ సందర్భంగా అమర జవాన్ల త్యాగాలను స్మరించిన కంచర్ల రవి గౌడ్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీర జవాన్లకు బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం ప్రదర్శించిన అపార ధైర్యసాహసాలు, దేశభక్తి యావత్ భారతీయులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు తమ ప్రాణాలను అర్పించిన అమర జవాన్ల త్యాగాలను దేశం ఎన్నటికీ మరువదని అన్నారు. యువత అమర వీరుల త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధి, దేశ రక్షణ పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బక్కని వేణు యాదవ్, మల్యాల ప్రవీణ్, శివ, ధనికే రాజు, రాము, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్‌లో ఎస్ఎస్‌సీ, ఇంటర్ ప్రవేశాలకు దరఖాసుల ఆహ్వానం

**జులై 29 నుంచి ఆగస్టు 28 వరకు దరిఖాస్తుల స్వీకరణ**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) జీ. శారద తెలిపారు.

ఆసక్తి గల అభ్యర్థులు జులై 29 నుంచి ఆగస్టు 28 వరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు అవసరమైన ధ్రువపత్రాలను జత చేసి సంబంధిత ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో సమర్పించాలని తెలిపారు.

మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యను కొనసాగించాలని డీఈవో కోరారు.

మరిన్ని వివరాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ ఆర్. రవీందర్‌ను 9440415099 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



## జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి!

**రెవెన్యూ ఆపరేటర్లను వెంటనే విధుల్లోకి తీసుకోండి: సీఎం రేవంత్‌కు టీ జీవన్ రెడ్డి లేఖ**

**ఎన్నికల వాగ్దానాలు ఏమయ్యాయి?.. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘాటు విమర్శలు**

జగిత్యాల, జూలై 28 (నమస్తే తెలంగాణ/ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నిరుద్యోగ వాగ్దానాలను తక్షణమే నెరవేర్చాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం ఒక బహిరంగ లేఖ రాశారు. జగిత్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా మొదటి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు, ఆ తర్వాత ఏటా లక్ష చొప్పున ఉద్యోగాల కల్పనతో పాటు స్పష్టమైన జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలని స్పష్టం చేశారు. వీటితో పాటు రెవెన్యూ కార్యాలయాలలో ఏకపక్షంగా తొలగించిన 600 మంది కంప్యూటరు ఆపరేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉద్యోగాల భర్తీపై నిర్లక్ష్యం తగదు! ఎన్నికల సమయంలో ప్రభుత్వంలో ఖాళీలుగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ నిర్ణీత కాల వ్యవధిలో భర్తీ చేస్తామని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని జీవన్ రెడ్డి గుర్తు చేశారు. కానీ, దాదాపు రెండున్నర సంవత్సరాలు (30 మాసాలు) గడిచినప్పటికీ మొదటి ఏడాది 2 లక్షల ఉద్యోగాల భర్తీ కానీ, తదుపరి ఏటా లక్ష ఉద్యోగాల భర్తీ కానీ జరగలేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తుందని భావించిన ప్రజా ప్రభుత్వం.. ఉద్యోగాల భర్తీపట్ల ఏవిధమైన కార్యాచరణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనివల్ల యువత తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం ప్రైవేట్ రంగంలో స్వయం ఉపాధి కల్పించే 'రాజీవ్ యువ వికాసం' పథకం కూడా నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు.

600 కుటుంబాలను రోడ్డున పడేస్తారా? గత దశాబ్ద కాలంగా రెవెన్యూ కార్యాలయాలలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తున్న దాదాపు 600 మందికి పైగా కంప్యూటర్ ఆపరేటర్లను ఏ కారణం లేకుండా విధుల నుండి తొలగించడాన్ని జీవన్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 600 పైగా నిరుపేద కుటుంబాలు రోడ్డున పడటం దురదృష్టకరమని, ఇది ప్రభుత్వ నియంతృత్వ విధానానికి అద్దం పడుతోందని ఆరోపించారు.

తక్షణమే కార్యాచరణ చేపట్టాలి.. ఈ పరిస్థితులలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, ఎన్నికల మేనిఫెస్టోకు అనుగుణంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 2 లక్షల ఉద్యోగాలు, 2025-26 కు సంబంధించి లక్ష ఉద్యోగాల భర్తీ కోసం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయడంతో పాటు, తొలగించిన కంప్యూటర్ ఆపరేటర్లను మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# షూటింగ్ వరల్డ్‌కప్: భారత్‌కు మరో కాంస్యం!

**10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మెరిసిన సోనమ్-హిమాన్షు జోడీ**

**టోర్నీలో 4 పతకాలతో మూడో స్థానంలో భారత్.. చైనాకు స్వర్ణం, రజతం**

బలగం టీవీ, న్యూఢిల్లీ

చైనాలోని హాంగ్జౌ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఎఫ్ (ISSF) వరల్డ్‌కప్‌లో భారత షూటర్ల పతకాల జోరు దిగ్విజయంగా కొనసాగుతోంది. టోర్నీలో భాగంగా జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీ సోనమ్-హిమాన్షు అద్భుత ప్రదర్శనతో కాంస్య పతకాన్ని (బ్రాంజ్ మెడల్) కైవసం చేసుకుంది.

ఎంతో ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో భారత జంట అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి 441.2 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచింది. కాగా, ఈ విభాగంలో ఆతిథ్య చైనా షూటర్లు తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరిచి స్వర్ణ, రజత పతకాలను క్లీన్ స్వీప్ చేశారు.

పతకాల పట్టికలో టాప్-3లో భారత్.. ఈ కాంస్య పతకంతో కలిపి ప్రస్తుత ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటిదాకా భారత షూటర్లు ఒక స్వర్ణం, ఒక రజతంతో పాటు రెండు కాంస్య పతకాలను తమ ఖాతాలో వేసుకున్నారు. దీనితో అంతర్జాతీయ వేదికపై దేశం సగర్వంగా నిలుస్తూ పతకాల పట్టికలో ప్రస్తుతం మూడో స్థానంలో కొనసాగుతోంది.

# గ్లాస్గోలో భారత్ సరికొత్త చరిత్ర!

**పారా అథ్లెటిక్స్‌లో షర్మిల ధన్‌ఖడ్‌కు చారిత్రక స్వర్ణం**
**ఏపీ వెయిట్‌లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు, హైజంపర్ సర్వేశ్‌లకు రజతాలు.. పతకాల సంఖ్య 10కి చేరిక**

బలగం టీవీ, న్యూఢిల్లీ

స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో సరికొత్త చరిత్ర లిఖించారు. పోలియో మహమ్మారి తెచ్చిన వైకల్యాన్ని, గృహ హింస రూపంలో ఎదురైన కష్టాలను ఎదిరించి.. 34 ఏళ్ల లేటు వయసులో కెరీర్ ప్రారంభించిన ధీర వనిత షర్మిల ధన్‌ఖడ్ పారా అథ్లెటిక్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలోనే పారా అథ్లెటిక్స్‌లో భారత్‌కు తొలి పసిడి పతకం అందించిన ఘనతను ఆమె సొంతం చేసుకుంది.



సోమవారం అర్ధరాత్రి జరిగిన ఎఫ్57 కేటగిరీ మహిళల షాట్‌పుట్ పోటీలో షర్మిల గుండును 9.81 మీటర్ల దూరం విసిరి సగర్వంగా స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. 20 ఏళ్ల కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్ చరిత్రలో భారత్‌కు ఇదే మొట్టమొదటి గోల్డ్ మెడల్ కావడం విశేషం. ఇదే పోటీలో భారత్‌కు చెందిన శిల్పా శైలా 7.26 మీటర్ల దూరం విసిరి కాంస్య పతకాన్ని (బ్రాంజ్) కైవసం చేసుకుంది. తొలుత నైజీరియా అథ్లెట్ మూడో స్థానంలో నిలిచినట్లు ప్రకటించినా, భారత్ చేసిన నిరసనతో జరిపిన రివ్యూలో నైజీరియా ప్లేయర్ ఫౌల్ చేసినట్లు తేలడంతో శిల్పకు కాంస్యం దక్కింది.

**ఒక్క కేజీ తేడాతో గోల్డ్ మిస్.. రికార్డుతో మెరిసిన ఏపీ లిఫ్టర్ అజయ్ బాబు**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 21 ఏళ్ల వెయిట్‌లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు పురుషుల 79 కేజీల కేటగిరీలో అద్భుత ప్రదర్శనతో రజత పతకం (సిల్వర్) సొంతం చేసుకున్నాడు. ఉత్కంఠభరితంగా సాగిన



ఫైనల్లో అజయ్ మొత్తం 330 కిలోల బరువు ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు. స్నాచ్ విభాగంలో 149 కిలోల బరువు మోసి సరికొత్త గేమ్స్ రికార్డు సృష్టించిన అజయ్, క్లీన్ అండ్ జెర్క్‌లో 181 కేజీలను క్లియర్ చేశాడు. అయితే మలేసియాకు చెందిన ఎరీ హిదాయత్ మొత్తం 331 కేజీలతో ఒక్క కిలో తేడాతో స్వర్ణం గెలవగా, అజయ్‌కు రజతం దక్కింది. ఇంగ్లండ్ లిఫ్టర్ క్రిస్ మర్రే (325 కేజీలు) కాంస్యం సాధించాడు.

**హైజంప్‌లో సర్వేశ్‌కు రజత రికార్డు!**

పురుషుల హైజంప్‌లో భారత అథ్లెట్ సర్వేశ్ కుశారే కొద్దిలో స్వర్ణం చేజార్చుకుని రజత పతకాన్ని అందుకున్నాడు. హోరాహోరీగా సాగిన పోటీలో సర్వేశ్, జమైకాకు చెందిన రొమైన్ బెక్‌ఫోర్డ్ ఇద్దరూ 2.25 మీటర్ల ఎత్తు దూకినా.. 2.28 మార్కును అందుకోలేకపోయారు. అయితే 'కౌంట్ బ్యాక్' (అంతకుముందు చేసిన విఫల ప్రయత్నాలు) లెక్కల ఆధారంగా బెక్‌ఫోర్డ్‌కు స్వర్ణం,



రెండు ప్రయత్నాల్లో ఫెయిలైన సర్వేశ్‌కు రజతం ఖరారైంది. అయినప్పటికీ కామన్వెల్త్ హైజంప్‌లో సిల్వర్ నెగ్గిన తొలి భారతీయ అథ్లెట్‌గా సర్వేశ్ రికార్డులకెక్కాడు. దీనితో భారత్ పతకాల సంఖ్య పదికి చేరింది.

**విధిరాతను ఎదిరించి.. స్వర్ణ చరిత్రను లిఖించి!**

హర్యానాలోని మహేందర్‌గఢ్ జిల్లా చిత్రౌలి గ్రామానికి చెందిన 42 ఏళ్ల షర్మిల ధన్‌ఖడ్ జీవితం ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. రెండేళ్ల వయసులోనే పోలియో బారిన పడి ఎడమ కాలు కోల్పోయిన షర్మిలకు, 19 ఏళ్లకే పెళ్లయ్యాక అదనపు కట్నం కోసం భర్త నరకం చూపించాడు. ఇద్దరు ఆడపిల్లలు పుట్టారనే కోపంతో రోడ్డుపైకి నెట్టేయడంతో ఆత్మహత్యే శరణ్యం అనుకున్న స్థితి నుండి పిల్లల కోసం బతకాలని నిర్ణయించుకుంది. ఇళ్లల్లో పనులు, స్వీపర్‌గా, సెక్యూరిటీ గార్డుగా చేస్తూ పిల్లలను సాకింది.

వ్యాపారవేత్త అజిత్ సింగ్‌తో రెండో వివాహం అయ్యాక ఆమె జీవితం మలుపు తిరిగింది. ఆమె పట్టుదలను గుర్తించి 2020లో (34 ఏళ్ల వయసులో) అజిత్ ఆమెను పారా అథ్లెటిక్స్ వైపు ప్రోత్సహించాడు. సాధారణంగా క్రీడాకారులు రిటైర్ అయ్యే వయసులో షాట్‌పుట్ పట్టిన షర్మిల.. కోచ్‌లు టెక్ చంద్, దేవేంద్ర పర్యవేక్షణలో కఠిన సాధన చేసింది. ఆమె డైట్ ఖర్చుల కోసంలో సొంతింటిని కూడా అమ్ముకుని అద్దె ఇంట్లోకి మారారు. గత కామన్వెల్త్, ఆసియా గేమ్స్‌లో నాల్గో స్థానంతో తృటిలో పతకాలు చేజారినా వెనకడుగు వేయకుండా శ్రమించి, నేడు గ్లాస్గో వేదికగా దేశానికి చారిత్రాత్మక పసిడి పతకాన్ని అందించి విధిరాతను మార్చుకుంది.

**తండ్రిని మించిన కొడుకు.. శ్రీనివాస్ - అజయ్ అరుదైన ఘనత!**

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా కొండవెలగాడ గ్రామానికి చెందిన వల్లూరి అజయ్ బాబు పతకంతో ఒక అరుదైన రికార్డు నమోదైంది. 2010 ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్‌లో అజయ్ తండ్రి శ్రీనివాసరావు 56 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో కాంస్యం గెలవగా, సరిగ్గా 16 ఏళ్ల తర్వాత కొడుకు అజయ్ బాబు రజతం నెగ్గి తండ్రిని మించిన తనయుడిగా నిలిచాడు. తండ్రి శిక్షణలోనే మెళకువలు నేర్చుకున్న అజయ్, 2024లో మోచేతి గాయంతో ఆటకు దూరమైనా మళ్లీ పుంజుకుని ఈ ఘనత సాధించాడు. తండ్రీకొడుకులు ఇద్దరూ కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు నెగ్గడం భారత క్రీడా చరిత్రలోనే అత్యంత అరుదైన విషయం.

ఇతర క్రీడా విశేషాలు:

బాక్సింగ్‌లో పతకాలు ఖాయం: భారత మహిళా బాక్సర్లు ప్రీతి పవార్ (54 కేజీలు), ప్రియా ఘంఘాస్ (60 కేజీలు) తమ క్వార్టర్స్ మ్యాచుల్లో విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. దీనితో భారత్‌కు మరో రెండు కాంస్య పతకాలు ఖాయమయ్యాయి. అయితే 65 కేజీల విభాగంలో పర్వీన్ క్వార్టర్స్‌లో ఓడి నిరాశపరిచింది.

ట్రాక్ అండ్ స్విమ్మింగ్: పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ స్విమ్మింగ్‌లో భారత స్టార్ శ్రీహరి నటరాజన్ హీట్స్‌లో 13వ స్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధించాడు. పురుషుల 400 మీటర్ల రేసులో నేషనల్ రికార్డు హోల్డర్ విశాల్ టీకే 46.49 సెకన్లతో 14వ స్థానం సాధించి సెమీస్‌కు క్వాలిఫై అయ్యాడు. పారా స్విమ్మింగ్ 50 మీటర్ల ఫ్రీస్టైల్ ఫైనల్లో ఏపీ కుర్రాడు రవి 6వ స్థానంలో, అలీ ఇమామ్ 8వ స్థానంలో నిలిచారు.



# ఇక అంతా నా ఇష్టం.. ఎవరి సలహాలూ అక్కర్లేదు!

**టీమిండియా స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ సంచలన వ్యాఖ్యలు**

**ఒక క్రికెటర్‌గా ఇప్పటికే ఎంతో సాధించా.. నా శైలిలోనే బ్యాటింగ్ చేస్తా**

బలగం టీవీ, న్యూఢిల్లీ

టీమిండియా స్టార్ ఓపెనర్ సంజూ శాంసన్ తన భవిష్యత్తు ప్రణాళికలు, బ్యాటింగ్ శైలిపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఒక క్రికెటర్‌గా తాను ఇప్పటికే ఎంతో సాధించానని, ఇక నుంచి ఫలితాల గురించి ఆలోచించకుండా కేవలం తన ఆటను పూర్తి స్థాయిలో ఆస్వాదిస్తానని స్పష్టం చేశాడు. అంతేకాకుండా, ఇకపై తన బ్యాటింగ్ విషయంలో ఎవరి సలహాలు, సూచనలు తనకు అక్కర్లేదని, ఎలా ఆడాలో నేనే నిర్ణయించుకుంటానని తేల్చి చెప్పాడు.

ఇంగ్లండ్ పర్యటన ముగిసిన అనంతరం 'జియోహాట్‌స్టార్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సంజూ శాంసన్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. ఈ ఇంటర్వ్యూకు సంబంధించిన తాజా ఎపిసోడ్‌లో సంజూ తన మనసులోని మాటను బయటపెట్టాడు.

నా శైలిలోనే ఆడుతాను: సంజూ "భారత క్రికెట్‌లో ఆటగాళ్ల మధ్య ఎప్పుడూ విపరీతమైన పోటీ ఉంటుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందే నేను ఈ పోటీ తత్వానికి దూరంగా జరిగాను. దేవుడి దయవల్ల ఓ క్రికెటర్‌గా నేను ఇప్పటికే చాలా సాధించాను. ప్రస్తుతం నాకు 31 ఏళ్లు. నేను ఇంకొన్నేళ్లు మాత్రమే అంతర్జాతీయ క్రికెట్ ఆడగలను. కాబట్టి ఇక నుంచి నా బ్యాటింగ్ విషయంలో ఎవరి సలహాలు, సూచనలు నాకు అవసరం లేదు. నేను ఎలా ఆడాలో నేనే నిర్ణయించుకుంటా. జట్టులో ఓ మంచి స్నేహితుడిగా ఉంటూ సహచర ఆటగాళ్లకు అండగా ఉంటాను. కానీ, మైదానంలో నా శైలిలో మాత్రమే ఆడుతాను" అని సంజూ శాంసన్ స్పష్టం చేశాడు.

భవిష్యత్తు గురించి ఆందోళన లేదు.. ఇటీవలి కాలంలో ఫామ్ కోల్పోయి జట్టులో స్థానం కోసం ఇబ్బంది పడుతున్న సంజూ.. భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించడం లేదని చెప్పాడు. "ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 ముగిసిన తర్వాత.. నేను మళ్లీ 2026 వరల్డ్ కప్ ఆడుతానని ఎప్పుడూ ఊహించలేదు. ప్రస్తుతం నేను భారత 15 మంది సభ్యుల ప్రధాన జట్టులో కూడా లేను. అలాంటప్పుడు ఇప్పుడే రాబోయే 2028 ప్రపంచకప్ గురించి నేను ఎందుకు ఆందోళన చెందాలి?" అని సంజూ ఎదురుప్రశ్నించాడు.

సరిగ్గా ఆడక తుది జట్టులో చోటు దూరం.. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో ఒక మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన సంజూ శాంసన్, ఆ తర్వాత జరిగిన సిరీస్‌ల్లో దారుణంగా విఫలమయ్యాడు. ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లండ్‌తో జరిగిన వరుసగా మూడు మ్యాచ్‌ల్లో తక్కువ స్కోర్లకే పరిమితమవ్వడంతో అతను భారత తుది జట్టులో చోటు కోల్పోవాల్సి వచ్చింది. ఇంగ్లండ్‌తో జరిగిన ఆఖరి టీ20లో తిరిగి అవకాశం దక్కించుకున్నప్పటికీ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. కాగా, ప్రస్తుతం జరుగుతున్న జింబాబ్వే పర్యటన నుంచి సెలెక్టర్లు సంజూ శాంసన్‌కు విశ్రాంతి కల్పించిన సంగతి తెలిసిందే.

# లంకతో టెస్టు సిరీస్‌కు భారత జట్టు ఇదే...

**15 మంది సభ్యులతో కూడిన భారత జట్టు ప్రకటన**
**బుమ్రా, జడేజా పునరాగమనం.. 33 ఏళ్ల వయసులో సారాంశ్ జైన్‌కు తొలిసారి పిలుపు**

బలగం టీవీ, న్యూఢిల్లీ

వచ్చే నెలలో శ్రీలంక పర్యటనలో జరగబోయే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) 15 మంది సభ్యులతో కూడిన బలమైన భారత జట్టును ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక సిరీస్‌కు యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, వైస్ కెప్టెన్‌గా కె.ఎల్. రాహుల్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా జరగనున్న తొలి టెస్టు మ్యాచ్‌తో భారత జట్టు బరిలోకి దిగనుంది.

ఈ జట్టులోకి స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాలు తిరిగి పునరాగమనం చేశారు. అయితే, గాయం కారణంగా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కనీసం తొలి టెస్టుకైనా దూరం కానున్నాడు. కాగా, బుమ్రా, సాయి సుదర్శన్‌ల భాగస్వామ్యంపై ఇంకా వంద శాతం స్పష్టత రాలేదు.





వీరిద్దరూ సిరీస్‌లో ఆడటం అనేది బీసీసీఐ మెడికల్ టీమ్ ఇచ్చే ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుంది.

33 ఏళ్ల వయసులో సారాంశ్ జైన్‌కు లక్కీ ఛాన్స్! గాయపడిన వాషింగ్టన్ సుందర్ స్థానంలో మధ్యప్రదేశ్ ఆఫ్ స్పిన్నర్, 33 ఏళ్ల సారాంశ్ జైన్‌కు సెలెక్టర్లు ఊహించని విధంగా తొలిసారి జాతీయ జట్టులోకి పిలుపునిచ్చారు. 2014 నుంచి మధ్యప్రదేశ్ తరఫున డొమెస్టిక్ క్రికెట్ ఆడుతున్న జైన్.. ఇటీవల శ్రీలంకతో జరిగిన ఇండియా-ఎ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. గాలేలో జరిగిన రెండో మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో 70 పరుగులు చేయడంతో పాటు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 6 వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే, జట్టులో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ రూపంలో బలమైన స్పిన్ త్రయం ఉండటంతో సారాంశ్‌కు తొలి టెస్టు తుది జట్టులో అవకాశం దక్కడం అంత సులువు కాదు.

టెస్టు సిరీస్ షెడ్యూల్: భారత్, శ్రీలంక జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆగస్టు 2026లో జరగనుంది. తొలి టెస్టు మ్యాచ్ ఆగస్టు 15 నుండి గాలే వేదికగా ప్రారంభం కానుండగా, రెండో అలాగే చివరి టెస్టు మ్యాచ్ కొలంబోలో జరగనుంది.

భారత టెస్టు జట్టు ఇదే:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కె.ఎల్. రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్, సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్, సారాంశ్ జైన్.



# గ్రీవ్స్ 'రన్-లెస్' రికార్డు.. పాక్ విలవిల!

**వరుసగా 5 మెయిడెన్ ఓవర్లు.. 5 వికెట్లు పడగొట్టిన విండీస్ పేసర్**

**ఒక్క పరుగు ఇవ్వకుండా ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా జస్టిన్ గ్రీవ్స్ ప్రపంచ రికార్డు**

బలగం టీవీ, న్యూఢిల్లీ

స్వదేశంలో పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో వెస్టిండీస్ పేసర్ జస్టిన్ గ్రీవ్స్ ఊహించని స్పెల్‌తో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. తన సంచలన పేస్ మ్యాజిక్‌తో (5/27) ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను గజగజ వణికించిన గ్రీవ్స్.. టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఎవరికీ సాధ్యంకాని అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. మ్యాచ్‌లో వరుసగా ఐదు ఓవర్ల పాటు ఒక్క పరుగూ ఇవ్వకుండా (5 మెయిడెన్ ఓవర్లు) ఐదు వికెట్లు పడగొట్టి పాకిస్థాన్ జట్టు వెన్నువిరిచాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇలా వరుసగా ఐదు ఓవర్లలో సున్నా పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా గ్రీవ్స్ చరిత్ర సృష్టించాడు.

ఏడు ఓవర్లలో 6 వికెట్లు అవుట్.. జస్టిన్ గ్రీవ్స్ విధ్వంసకర బౌలింగ్ దాటికి పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో ఒక్కసారిగా కుప్పకూలింది. ఒక దశలో 62.5 ఓవర్లకు 244 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి అత్యంత బలంగా కనిపించిన పాక్.. కేవలం ఏడు ఓవర్ల వ్యవధిలోనే వరుసగా ఆరు వికెట్లను చేజార్చుకుని 267 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

మసూద్ సెంచరీ ఇన్నింగ్స్‌కు బ్రేక్! ఇన్నింగ్స్ 64వ ఓవర్లో బంతినందుకున్న గ్రీవ్స్.. అద్భుత శతకంతో పాక్‌ను నడిపిస్తున్న కెప్టెన్ షాన్ మసూద్ (109)ను ఔట్ చేసి విండీస్‌కు బ్రేక్ ఇవ్వడంతో పాటు పాక్ పతనానికి శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత విరామం లేకుండా వేసిన వరుస ఓవర్లలో అలి ఉస్మాన్, ఆమిర్ జమాల్, మహమ్మద్ రిజ్వాన్, మహమ్మద్ అబ్బాస్‌లను వరుసగా పెవిలియన్ చేర్చాడు. ఈ క్రమంలోనే తన టెస్ట్ కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన (ఫైవ్ వికెట్ హాల్) నమోదు చేశాడు. గ్రీవ్స్ దెబ్బకు విండీస్ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది.

# టీమిండియా కోచింగ్ స్టాఫ్‌లో భారీ మార్పులు!

**సహాయక కోచ్ డస్చేట్ రాజీనామా.. ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌పై వేటు**

**లంక పర్యటనకు ముందే ఇద్దరు సహాయక కోచ్‌లకు బీసీసీఐ సాగనంపు**

బలగం టీవీ, న్యూఢిల్లీ

శ్రీలంక పర్యటనకు బయల్దేరడానికి ముందే భారత పురుషుల క్రికెట్ జట్టు కోచింగ్ యూనిట్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీమిండియాకు సేవలందిస్తున్న ఇద్దరు కీలక సహాయక కోచ్‌ల సేవలకు ఎండ్ కార్డ్ పడింది. ప్రధాన కోచ్ గౌతం గంభీర్ ఏరికోరి తన కోచింగ్ బృందంలోకి తీసుకున్న అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్చేట్ పదవి నుంచి వైదొలగగా, రాహుల్ ద్రవిడ్ హయాం నుండి ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందిస్తున్న టి.దిలీప్ కాంట్రాక్ట్ ముగియడంతో బీసీసీఐ అతడిని కూడా సాగనంపింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో టీమిండియా వైట్‌వాష్‌కు గురైన అనంతరం డస్చేట్ సమర్పించిన రాజీనామా లేఖను మంగళవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) అధికారికంగా ఆమోదించింది. కీలకమైన లంక పర్యటనకు ముందే వీరిద్దరూ ఒకేసారి వైదొలగడం భారత జట్టుకు కొంత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.



వ్యక్తిగత కారణాలు, విమర్శల నేపథ్యం.. నెదర్లాండ్స్ మాజీ ఆటగాడైన రియాన్ టెన్ డస్చేట్ రెండేళ్ల క్రితం భారత జట్టు సహాయక కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR) కోచింగ్ సిబ్బందిలో ఒకడిగా ఉన్న అతడిని గౌతం గంభీర్ ప్రత్యేకంగా భారత జట్టు బృందంలోకి తీసుకువచ్చాడు. అయితే, ఇటీవల స్వదేశంలో టీ20 వరల్డ్‌కప్ గెలుపొందిన భారత్... ఆ తర్వాత పసికూన ఐర్లాండ్ చేతిలో ఊహించని విధంగా వైట్‌వాష్‌కు గురైంది. దాంతో ఆటగాళ్లతో పాటు కోచింగ్ సిబ్బందిపైనా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇంగ్లండ్‌తో తొలి వన్డే జరుగుతుండగానే డస్చేట్ రాజీనామా వార్త వెలుగులోకి రాగా, మంగళవారం బీసీసీఐ దాన్ని ఆమోదించింది.

కుటుంబానికే ప్రాధాన్యం: డస్చేట్ రాజీనామాకు విమర్శలతో పాటు డస్చేట్ వ్యక్తిగత కారణాలు ప్రధాన కారణంగా నిలిచాయి. డస్చేట్ కుటుంబం ప్రస్తుతం లండన్‌లో నివసిస్తోంది. అతడికి ముగ్గురు పిల్లలు కాగా, డస్చేట్ భారత జట్టు ప్రయాణాల వల్ల నిరంతరం బిజీగా ఉండటంతో లండన్‌లో ఉంటూ పిల్లలను చూసుకోవడం అతడి భార్యకు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో పిల్లలతో ఎక్కువ సమయం గడపాలనే ఉద్దేశంతోనే డస్చేట్ టీమిండియా కోచింగ్ పదవిని వదులుకున్నాడు. ఇకపై లండన్‌లోనే ఉంటూ తన కోచింగ్ కెరీర్ కొనసాగించాలని అతడు భావిస్తున్నాడు. మరోవైపు సుదీర్ఘ కాలంగా ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన టి.దిలీప్‌తో ఉన్న అనుబంధాన్ని కూడా తెంచుకోవాలని బీసీసీఐ నిర్ణయించడంతో కోచింగ్ విభాగంలో కొత్త ముఖాలు రావడం ఖాయమైంది.

# ఆదర్శకుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల

టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబో తుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.




# త్వరలోనే రాకా షూటింగ్‌లోకి అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.



ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగు తోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకా రం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది.




# అఖిల్ వ్యక్తిగత జీవితంపై ట్రోలింగ్



## జైన్ కులం, మతంపై విమర్శలు..పట్టించుకోని యువనటుడు

అక్కినేని హీరో అఖిల్ అక్కినేని తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ట్రోలింగ్‌కు తొలిసారి ఘాటుగా స్పందించారు. గతేడాది తన ప్రేయసి జైనబ్‌ని వివాహం చేసుకున్న తర్వాత సోషల్ మీడియాలో ఆమె వయసు, మతంపై వచ్చిన విమర్శలను తాము ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టం చేశారు. ప్రేమ, పరస్పర అవగాహన, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే తమ బంధానికి అసలైన బలమని చెప్పారు. 'లెనిన్' సినిమాతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న అఖిల్, ఓ తాజా పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ గురించి అడగగా.. అలాంటి విషయాలకు తాము అసలు ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్ గురించి ఆలోచించాలా? లేక జీవితాంతం నాతో ఉండే వ్యక్తితో సంతోషంగా జీవించడం గురించి ఆలోచించాలా? నాకు రెండోది ముఖ్యమైంది. అందుకే ట్రోలింగ్‌ను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని అఖిల్ అన్నారు.పెళ్లికి ముందే తమ జీవితంలో ఇలాంటి విమర్శలు వస్తాయని జైనబ్‌కు చెప్పినట్లు అఖిల్ వెల్లడించారు.నేను నటుడిని. నా జీవితంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో విమర్శలు తప్పవు. అందుకు సిద్ధంగా ఉండాలని నేను ముందుగానే చెప్పాను. ఆమె కూడా చాలా పరిణతితో అర్థం చేసుకుంది. వయసు, మతం గురించి వచ్చిన కామెంట్లను ఎంతో పాజిటివ్‌గా తీసుకుంది. అదే నాకు మరింత ధైర్యాన్ని ఇచ్చింది అని తెలిపారు.తన కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన సమయంలో జైనబ్ తనకు అండగా నిలిచిందని అఖిల్ భావోద్వేగంగా చెప్పారు. ప్రేమలో కులం, మతం, వయసు కంటే పరస్పర అవగాహన, నమ్మకం ముఖ్యమని అఖిల్ అభిప్రాయపడ్డారు. పెళ్లికి ముందు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవాలని యువతకు సూచించారు.



# పొలిమేర-3లో అర్జున్

టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో అర్జున్ సర్జా మరోసారి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.






# సెప్టెంబర్‌లో మహేంద్రగిరి వారాహి

సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లమూడి ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సోషియో ఫాంటసీ చిత్రాన్ని సెప్టెంబర్ 11న విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. ఈ సినిమా కోసం రెండున్నరేళ్లు చర్చలు జరిగినట్లు సుమంత్ తెలిపారు. మధ్యలో ఈ సినిమా సందిగ్ధంలో పడిందని గుర్తుచేసుకున్నారు. ఇందులో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయని తెలిపారు. ఓ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాలు కనిపిస్తారని నిర్మాత మధు వెల్లడించారు. కథ నచ్చడంతో వెంటనే ఓకే చేశారు. వారాహి అమ్మవారిగా నటించారా లేదా.. మరేదైనా పాత్రలో కనిపిస్తారా అనేది స్క్రీన్‌పై చూసి తెలుసు కోవాలి. సంతోష్‌కు ఆధ్యాత్మికత, చరిత్ర గురించి చాలా విషయాలు తెలుసు. మొదట అనుకున్న కథలో కొన్ని మార్పులు చేసి దీన్ని రూపొందించాం. ఇందులో నటించడం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది.

